భారత
కమ్యూనిస్టు పార్టీ
(మార్క్సిస్టు)

# భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాజకీయ పరిణామాలపై నివేదిక

(2021 ఆగస్టు 6-8 తేదీల్లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో ఆమోదించబడినది)

ప్రచురణ : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ కమిటీ

# భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాజకీయ పరిణామాలపై నివేదిక

(2021 ఆగస్టు 6–8 తేదీల్లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో ఆమోదించబడినది)

కేంద్ర కమిటీ గతసారి సమావేశం అయి ఆరుమాసాలు గడిచింది. పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు, అస్సాం, పాండిచెరి రాష్ట్రాల ఎన్నికలు, కరోనా మహమ్మారి రెండో వెల్లువ సృష్టించిన భీభత్సం వల్ల కేంద్ర కమిటీ సమావేశాలు ఆలస్యంగా జరిగాయి. ఈ కాలంలో అంతర్జాతీయంగా, జాతీయంగా మనం గమనించాల్సిన, అవగాహన చేసుకోవాల్సిన అనేక ముఖ్యమైన పరిణామాలు జరిగాయి.

## అంతర్జాతీయ పరిణామాలు

### కోవిడ్ మహమ్మారి

కరోనా మహమ్మారి ప్రపంచ వ్యాపితంగా బీభత్సం సృష్టిస్తూనే ఉంది. కొన్ని దేశాల్లో కొత్త కేసులు మళ్లీ విజృంభించాయి. 2021 ఆగస్టు 1 నాటికి సుమారు 20 కోట్ల మంది ప్రజలు (ఖచ్చితంగా చెప్పాలంటే 19 కోట్ల 90 లక్షల 25 వేల 424 మంది) కరోనాకు గురయ్యారు. 40 లక్షల మందికి పైగా (42,40,425) చనిపోయారు. ప్రతి రోజూ అయిదు లక్షల కొత్త కేసులు వస్తుంటే, 8,000 మంది వరకు చనిపోతున్నారు. ఇప్పటికే అనేక వర్ధమాన దేశాలను అతలాకుతలం చేసిన డెల్టా రకం వైరస్ కొత్తగా విజృంభిస్తుందన్న భయాలు

వ్యక్తమవుతున్నాయి. చైనాలోని 35 నగరాల్లోనూ, మొత్తం 33 రాష్ట్రాలకు గాను 17 రాష్ట్రాల్లోనూ డెల్టా రకం వైరస్ వ్యాపించింది. చైనాలోని వివిధ ప్రాంతాల్లో కొత్తగా లాక్‌డౌన్‌లు విధించారు. దేశ వ్యాపితంగా ప్రజలందరికీ మళ్లీ కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నారు.

## ప్రపంచ వ్యాపితంగా వ్యాక్సిన్ అసమానతలు

వ్యాక్సిన్ చాలా త్వరగా, అందరికీ వేస్తేనే గాని మహమ్మారిని కట్టడి చేయలేమని ఇప్పుడు స్పష్టమైపోయింది. కాని ప్రపంచ వ్యాపితంగా వ్యాక్సిన్ అసమానతలు చాలా తీవ్రంగా ఉన్నందున వ్యాక్సినేషన్ కార్యక్రమం అవరోధాలనెదుర్కొంటోంది. అధికాదాయ దేశాలు పేద దేశాలతో పోలిస్తే 70 రెట్లు అధికంగా తమ పౌరులకు వ్యాక్సిన్ వేయించాయి. ప్రపంచ జనాభాలో 16 శాతం ఉన్న ధనిక దేశాలు అందుబాటులో ఉన్న మొత్తం కరోనా వ్యాక్సిన్ డోస్‌లలో 50 శాతాన్ని ముందుగానే కొనేశాయి. 50 ఆఫ్రికా దేశాల్లో 3.14 కోట్ల మందికి మాత్రమే వ్యాక్సిన్లు వేసినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఓ) తెలిపింది. అంటే ఈ దేశాల్లో 2 శాతం ప్రజలకు మాత్రమే ఒక్క డోస్ అందిందన్న మాట. ప్రపంచంలోని 10 దేశాలు ప్రపంచ వ్యాపితంగా అందుబాటులో ఉన్న వ్యాక్సిన్ డోస్‌లలో 77 శాతాన్ని వినియోగించాయి.

అభివృద్ధి చెందిన దేశాలు తమ అవసరాలకు మించి అనేక రెట్లు ఎక్కువ వ్యాక్సిన్‌లను నిల్వ చేసుకోవడం దీనికి ఒక కారణం. ఈ దేశాలు 100 కోట్ల డోస్‌లను ఇతరుకు ఇచ్చినా సరే ఇంకా వారి వద్ద వారి ప్రజల్లోని 12 ఏళ్లు దాటిన వారిలో 80 శాతం మందికి వ్యాక్సిన్ వేయడానికి సరిపడా నిల్వలుంటాయి.

వ్యాక్సిన్‌లపై పేటెంట్ హక్కులను అమలు చేయడం మరో కారణం. దీని వల్ల వ్యాక్సిన్‌ల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కాబట్టి అనేక పేద దేశాలు వాటిని కొనలేకపోతున్నాయి.

కరోనా మహమ్మారి పెట్టుబడిదారీ దేశాల్లోని ఆరోగ్య రంగంలోని లోపాలను ఎత్తి చూపింది. ఈ విషయంలో పేద దేశాల్లో పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. ఒకవైపు వ్యాక్సిన్ అసమాతనలు, మరోవైపు దయనీయమైన ప్రజారోగ్య వ్యవస్థలు కలిసి అమానమీయమైన వైపరీత్యాన్ని సృష్టించాయి.

ప్రపంచంలోని మొత్తం జనాభాను కరోనా మహమ్మారి నుండి రక్షించనిదే ఎరికీ రక్షణ ఉండదు. మహమ్మారి కొనసాగుతూ ఉండడం అంటే కొత్త రకాల వైరస్‌లు పుట్టుకు వస్తుండడమే. ఈ కొత్త రకాలను నిరోధించడానికి ఇప్పుడు

వేసిన వ్యాక్సిన్ వల్ల ఏర్పడే రోగనిరోధక శక్తి సరిపోదు. దీని వల్ల ప్రపంచ వ్యాపితంగా మరీ ముఖ్యంగా పేద దేశాల్లో సరికొత్త ఆరోగ్య వైపరీత్యాలు తలెత్తుతాయి.

మరోవైపు చైనా 100కు పైగా దేశాలకూ, అంతర్జాతీయ సంస్థలకూ 50 కోట్లకు పైగా వ్యాక్సిన్ డోస్‌లు సరఫరా చేసింది. దీంతో ప్రపంచంలోనే అత్యధిక వ్యాక్సిన్‌లు సరఫరా చేసిన దేశంగా చైనా నిలిచింది. 100కు పైగా దేశాల్లో వినియోగానికి చైనా వ్యాక్సిన్‌లు ఆమోదం పొందాయి. ఈ మహమ్మారిని కట్టడి చేయడానికి ప్రపంచ వ్యాపితంగా ప్రతి ఒక్కరికీ ఉచితంగా వ్యాక్సిన్‌లు వేయడం చాలా అవసరం.

## ప్రపంచ ఆర్థిక వ్యవస్థ

ఈ ఏడాది ప్రపంచ ఆర్థికాభివృద్ధి 6 శాతం ఉంటుందని ఐఎంఎఫ్‌కు చెందిన ప్రపంచ ఆర్థిక అంచనా (జులై 2021) తెలిపింది. 2020లో ప్రపంచ జిడిపి 3.3 శాతం క్షీణించిందని అంతకు ముందు ఐఎంఎఫ్ తెలిపింది.

ఈ ఏడాది జిడిపి వృద్ధి 5.6 శాతం ఉంటుందని ప్రపంచ బ్యాంకు (జులై 2020) తెలిపింది. అంతకు ముందు సంవత్సరం బాగా క్షీణించిన వృద్ధిని ఆధారం చేసుకుని లెక్కిస్తే ఈ పెరుగుదల కనిపిస్తోంది. అయితే 2022వ సంవత్సరంలో వృద్ధి రేటు కరోనా మహమ్మారి ముందు వృద్ధి కన్నా 2 శాతం తక్కువగానే ఉంటుందని ఈ గణాంకాలు తెలుపుతున్నాయి.

వ్యాక్సిన్‌ను గనుక శీఘ్రంగా వేయకపోతే ఆర్థికాభివృద్ధి ఇప్పుడు తెలిపిన దానికన్నా తగ్గవచ్చునని ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకులు రెండూ హెచ్చరించాయి.

## అమెరికా, ఇయు కొత్త ఉద్దీపన ప్యాకేజీలు

అమెరికా, ఐరోపా యూనియన్ (ఇయు)లు ఇచ్చే ఉద్దీపన పథకాల వల్ల ఆర్థిక రంగం పుంజుకుంటుందన్న ఆశావహ అంచనాలతో ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకులు ఈ నిర్ధారణలకు వచ్చాయి.

అమెరికా అధ్యక్షుడు బైడెన్ 1.9 లక్షల కోట్ల డాలర్ల కొత్త ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించారు. ఏడాదికి 75,000 డాలర్ల కన్నా తక్కువ ఆదాయం గలవారికి నేరుగా నగదు ఇవ్వడం, వారానికి 300 డాలర్ల నిరుద్యోగ బీమా ప్రోత్సాహం ఇవ్వడం, శిశువుల పన్ను రుణాలను విస్తరించడం వంటివి ఈ ప్యాకేజీలో ఉ

న్నాయి. ఇటీవలి కాలంలో ప్రభుత్వం ప్రకటించిన అతి పెద్ద ఆర్థిక ఉద్దీపన ఇది. 2008లో జరిగిన వాల్‌స్ట్రీట్ పతన సంక్షోభం అప్పుడు ప్రకటించిన దానికన్నా ఇది పెద్ద ఉద్దీపన ప్యాకేజీ. ఈ ఉద్దీపన వల్ల కార్మికులు, మధ్య తరగతి ప్రజలు కొంత ప్రయోజనం పొందినప్పటికీ నయా–ఉదారవాదం ఆదేశాల మేరకు ప్రకటించబడిన ఈ ప్యాకేజీ వల్ల ఎక్కువగా లాభ పడింది మాత్రం బడా వ్యాపారులు, ద్రవ్య పెట్టుబడిదారులే. ఈ సూపర్ ధనవంతులపై పన్నులు పెంచుతానని ఎన్నికల్లో ప్రచారం చేసిన బైడెన్ ఆశ్చర్యకరంగా ఆ పని మాత్రం చేయలేదు.

కరోనా మహమ్మారి తరువాత ఇయు తన బడ్జెట్ ద్వారా 1.8 లక్షల కోట్ల యూరోల (2.2 లక్షల కోట్ల డాలర్ల) ఆర్థిక ప్యాకేజీ ప్రకటించింది. ఇందులో పెద్ద భాగాన్ని ప్రజా ఖర్చులకు కేటాయించింది.

ఈ భారీ ద్రవ్య ప్యాకేజీలు నయాఉదారవాదం బోధిస్తున్న దానికి భిన్నమైనవి. అందువల్ల ప్రస్తుత ప్రపంచ ఆర్థిక మాంద్యాన్ని నివారించడంలో నయాఉదారవాదపు దివాళాకోరుతన్నాన్ని ఇది సూచిస్తోంది. అయితే పేద దేశాల చేత మాత్రం ద్రవ్య క్రమశిక్షణను బలవంతంగా అమలు చేయిస్తున్నారు. దాని వల్ల ఆ దేశాల్లో ప్రభుత్వ ఖర్చు తగ్గి పోతున్నాయి. ఈ "పొదుపు చర్యల" వల్ల సంక్షేమ కార్యక్రమాలకు కోతపడి, శ్రామిక ప్రజానీకం మరింత దోపిడీకి గురవుతున్నారు.

## ప్రపంచ కనీస పన్ను

అమెరికా, చైనా, భారత్‌తో సహా దాదాపు 150 దేశాలు ప్రపంచ కనీస పన్ను (జిఎంటి)కి మద్దతిచ్చాయి. దీని కింద బడా ప్రపంచ కార్పొరేట్లపై కనీసం 15 శాతం పన్ను విధిస్తారు. పన్ను స్వర్గాలుగా ఉన్న కొన్ని దేశాల్లో కంపెనీలను రిజిస్టరు చేసుకుని పన్ను ఎగ్గొట్టడాన్ని నిరోధించడానికి ఈ పన్ను వేశారు. ప్రపంచ కార్పొరేట్లు రిజిస్టరైన చోట కాకుండా ఎక్కడైతే వ్యాపారం చేస్తున్నాయో అక్కడ పన్ను విధిస్తారు. అనేక దేశాల ఆర్థిక వ్యవస్థలను పునరుజ్జీవింపజేసేందుకు ఈ చర్య తీసుకున్నారు. గరిష్ట లాభాలు గడించాలన్న నయా–ఉదారవాద లక్ష్యాన్ని నెరవేర్చడానికి ఈ చర్య అవసరమైంది. ఇటువంటి పన్ను విధింపు పై అనేక వివాదాలు, అభిప్రాయాలు ఉన్నాయి. వాటిని పరిష్కరించాల్సి ఉంది.

సూపర్–ధనికులపై పన్ను విధించడంతోపాటే శ్రామిక ప్రజలకు కనీస వేతనాలు గ్యారంటీ చేయడం, సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ, ఇతర సామాజిక

సంక్షేమ చర్యలు చేపడితేనే అర్ధవంతమైన ఆర్థిక పునరుజ్జీవనం సంభవిస్తుంది.

## ప్రజలపై ప్రభావం

**పెరుగుతున్న ఆకలి**: తక్కువ ఆదాయ దేశాల్లో గతంలో ఉన్న పెరుగుదల వెనపట్టు పట్టిందనీ, ఆకలి బాగా పెరిగిపోయిందనీ ప్రపంచ బ్యాంకు తెలిపింది. రానున్న కాలంలో ఆహార ధరలు మరింత పెరిగిపోతాయి. దాంతో ప్రజల ఈతిబాధలు మరింత అధికమవుతాయి. 2021 జులైలో వ్యవసాయ సరుకుల ధరల సూచీ 2013 తరువాత అత్యధికంగా నమోదయింది. ధరలు పెరిగి, ఆదాయాలు తగ్గడంతో ప్రపంచ వ్యాపితంగా గత ఏడాది జనాభాలో 10వ వంతు (సుమారు 81.1 కోట్ల) మంది పోషకాహారలోపానికి గురయ్యారని యునిసెఫ్ అంచనా వేసింది. దీని వల్ల 15 కోట్ల మంది పిల్లలు ఎదుగుదల లేక శుష్కించారని, 4.5 కోట్ల మంది ఎందుకూ పనికిరాకుండా పోయారని తెలిపింది. 2020 నుండి 2030 మధ్య తక్కువ ఆదాయ, మధ్య ఆధాయ దేశాల్లో 2.2 కోట్ల మంది పిల్లలు ఎదుగుదల లేకుండా శుష్కించుకుపోతారని, మరో 4 కోట్ల మంది పిల్లలు పనికిరాకుండా పోతారని అంచనా. గత ఏడాదికన్నా మరో 18 కోట్ల మంది తీవ్రమైన ఆకలికి గురవుతారని అంచనా వేశారు. 2020లో 237 కోట్ల మంది ప్రజలకు సరిపడ్డా ఆహారం దొరకలేదు. అంటే గత ఏడాదితో పోలిస్తే వీరి సంఖ్య 32 కోట్లు పెరిగింది. దుర్భిక్ష పరిస్థితుల్లో నివసిస్తున్న ప్రజల సంఖ్య ఆరు రెట్లు పెరిగిందని ఆక్స్‌ఫామ్ అంచనా వేసింది. ప్రపంచంలో ప్రతి నిమిషానికీ 11మంది ప్రజలు తీవ్రమైన ఆకలితో చనిపోతున్నారు. ప్రపంచంలో ఆకలి కేంద్రాలుగా ఎదుగుతున్న దేశాల్లో భారత్, బ్రెజిల్, దక్షిణాఫ్రికాలు ఉన్నాయి.

**పేదరికం:** 2021 చివరికి నిరుపేదరికంలో మగ్గుతున్న ప్రజల సంఖ్య 74.5 కోట్లకు పెరుగుతుందని అంచనా వేశారు. అంటే ఈ సంఖ్య గత ఏడాదితో పోలిస్తే 10 కోట్లు పెరుగుతోంది. 2020లో ప్రపంచ వ్యాపితంగా ఉపాధి కోల్పోవడం వల్ల మహిళలు 80,000 కోట్ల డాలర్లు నష్టపోయారు. 2021 నాటికి ప్రపంచ వ్యాపితంగా మరో 4.7 కోట్ల మంది మహిళలు నిరుపేదరికంలోకి జారుకుంటారు.

**పెరుగుతున్న అసమానతలు:** జెఫ్ బెజోస్ అంతరిక్ష యానం సందర్భంగా ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్‌కు చెందిన ప్రపంచ అసమానతల వ్యతిరేక ప్రచార అధిపతి దీపక్ జావియర్ ఇలా చెప్పారు:

"మనం ఇప్పుడు అసమానతల్లో అంతరిక్షానికి (స్ట్రాటోస్ఫియరిక్ ఇనీక్వాలిటీ) చేరుకున్నాం. బెజోస్ 11 నిమిషాల అంతరిక్ష యానానికి సన్నద్ధమవుతున్న ఈ తరుణంలో ప్రతి నిమిషానికి 11 మంది ప్రజలు ఆకలితో చనిపోతున్నారు. ఇది మానవ విజయం కాదు, మానవ అవివేకం".

అన్యాయమైన పన్నుల విధానం, కార్మిక రక్షణలో లసుగుల ద్వారా మహా ధనవంతులకు బాగా లాభం చేకూర్చి పెడుతున్నారు. కరోనా మహమ్మారి ప్రారంభం అయిన తరువాత అమెరికాలోని శతకోటీశ్వరులు 1.8 లక్షల కోట్ల డాలర్ల మేరకు ఆధాయాలు పెంచుకున్నారు. కోవిడ్ –19 వ్యాక్సిన్‌ల ద్వారా కొత్తగా 9 బడా ఫార్మా గుత్త సంస్థలు పుట్టుకొచ్చాయి.

**నిరుద్యోగం:** 2020లో ప్రపంచ వ్యాపితంగా 8.8 శాతం పని దినాలు తగ్గిపోయాయి. ఇవి 25.5 కోట్ల పూర్తికాలం ఉద్యోగాలతో సమానం. 2021లో ప్రపంచ సంక్షోభం వల్ల 7.5 కోట్ల మంది అదనంగా ఉద్యోగాలు కోల్పోతారని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) తెలిపింది. సంక్షోభానికి ముందు ఉన్న తీవ్ర నిరుద్యోగానికి, పాక్షిక నిరుద్యోగానికీ, దయనీయమైన పని పరిస్థితులకు ఇది అదనంగా తోడైంది. ప్రపంచ నిరుద్యోగం 2019లో 18.7 కోట్ల నుండి 2022 నాటికి ఒక్కసారిగా 20.5 కోట్లకు పెరిగిపోతుందని అంచనా. 2019తో పోలిస్తే నేడు మరో 10.8 కోట్ల మంది కార్మికులు పేదరికంలోకి, నిరుపేదరికంలోకి దిగజారిపోయారు. (అంటే కార్మిక కుటుంబం రోజుకు ఒక మనిషికి 3.2 డాలర్ల కన్నా తక్కువ ఆదాయంతో బతకాల్సిరావడం). 2020లో పురుషుల్లో ఉపాధి 3.9 శాతం తగ్గిపోతే మహిళా ఉపాధి మరింతగా 5 శాతం తగ్గిపోయింది. కరోనా సంక్షోభ లాక్‌డౌన్ల వల్ల మహిళలకు ఇంటి బాధ్యతలు పెరిగిపోయి తిరిగి వారు "పాత సంప్రదాయ పనులకు" పరిమితమయ్యే ప్రమాదం పెరిగింది. 2020లో ప్రపంచ వ్యాపితంగా యువజనుల్లో నిరుద్యోగం 8.7 శాతం పెరిగింది. పెద్ద వారిలో 3.7 శాతం నిరుద్యోగిత పెరుగుదలతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. కోల్పోయిన అనేక ఉద్యోగాలు డిజిటలైజేషన్, యాంత్రీకరణల వల్ల తిరిగి రావడం కష్టమైపోతుంది.

**విద్యకు దూరమవడం:** 2021 మే నాటికి 26 దేశాల్లోని పాఠశాలలు మూతపడిపోయాయని, 55 దేశాలల్లో పాక్షికంగా మూతపడ్డాయని యునెస్కో తెలిపింది. కరోనా మహమ్మారి వల్ల ప్రంపంచంలోని దాదాపు 90 శాతం మంది పాఠశాలకు వెళ్లే పిల్లల చదువుకు ఆటంకం కలిగింది. పాఠశాలల మూసివేతలు,

చదువులకు కలిగిన ఆటంకాల వల్ల పిల్లలు భవిష్యత్తులో దాదాపు 10 లక్షల కోట్ల డాలర్ల ఆదాయాలు కోల్పోయే అవకాశం ఉంది. పాఠశాలలమూసివేతల వల్ల కోట్లాది మంది పిల్లలలు తాత్కాలికంగా కాకుండా శాశ్వతంగా చదువులకు దూరమయ్యారు. ఈ పిల్లలు పనిలోకి వెళ్లిపోవడమో, పెళ్లిళ్లు చేసుకోవడమో, తల్లితండ్రులుగా మారిపోవడమో, విద్యపై ఆశక్తి కోల్పోవడమో, మేము పై క్లాసులను అందుకోలేమని భావించడమో లేక తమ దేశాల్లోని చట్టాల ద్వారా అమలవుతున్న ఉచిత, నిర్బంధ విద్య వయసు దాటిపోవడమో జరిగింది. పాఠశాలలు మూతపడ్డంతో విద్య ఆన్-లైన్‌కు వెళ్లింది. దాంతో ఇప్పటికే ఉన్న 'డిజిటల్ అంతరం' మరింత పెరిగిపోయింది. ఇంటర్నెట్ అందుబాటులో లేకపోవడం, కనెక్టివిటీ లేకపోవడం, ఉన్నా చాలా మంది ఇళ్లల్లో ఇంటర్నెట్ పెట్టుకోలేకపోవడం, దానికి తగ్గ వస్తుసామగ్రి సమకూర్చుకోలేకపోవడం, ఉపాధ్యాయులకు శిక్షణ లేకపోవడం, ఇంట్లో దానికి తగ్గ పరిస్థితులు లేకపోవడం దీనికి కారణం.

## చైనా: ప్రపంచంలో ఉన్నత స్థానానికి ఎదుగుదల

చైనా కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపక శతవార్షికోత్సవం జరుపుకుంటోంది. ఈ సందర్భంగా అది తన రెండు శతవార్షిక లక్ష్యాలను చేరుకున్నట్లు ప్రకటించింది. ఒకటి, 2020 నాటికి ఒకమోస్తరు అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడం. దేశ వ్యాపితంగా నిరుపేదరికాన్ని పూర్తిగా నిర్మూలించడం ద్వారా ఇది సాధ్యమైంది. 1949లో విప్లవం విజయం సాధించి చైనా ప్రజా రిపబ్లిక్ ఏర్పడిన తరువాత తొలి సంవత్సరాల్లో అది వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో సాధించిన అభివృద్ధిపై ఆధారపడి 1978 నుండి 'సంస్కరణలు, ప్రపంచానికి ఆర్థిక వ్యవస్థ ద్వారాలు తెరవడం' అనేవిధానాన్ని అమలు చూస్తూ వచ్చింది. దీని ద్వారా ఆర్థికాభివృద్ది ప్రాధాన్యతలు ఏర్పరచుకుంది.

1978 నుండి 85 కోట్ల మంది ప్రజలను నిరుపేదరికం నుండి బయటపడేసింది. వారికి ఆహారం, దుస్తులు, నిర్బంధ విద్య, మౌలిక వైద్య సదుపాయాలు, సురక్షిత గృహ సదుపాయం అందించింది. చైనా ప్రస్తుత దారిద్ర్య రేఖ బహుముఖ అంశాలపై ఆధారపడి ఉంది. అంతర్జాతీయ సంస్థలు రూపొందించిన ప్రమాణాలు, చైనా జాతీయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఈ దారిద్ర్య రేఖను నిర్ణయించారు. ఆదాయాలతోపాటు విద్య, ఆరోగ్యం, జీవన ప్రమాణాలను దృష్టిలో పెట్టుకున్నారు. 2010 స్థిర విలువ ఆధారంగా 2,300

యువాన్ల తలసరి వార్షికాదాయం, లేక ఒక వ్యక్తి కొనుగోలు శక్తి సమానత్వం (పిపిపి) ఆధారంగా రోజుకు 2.3 డాలర్ల ఆదాయాన్ని దారిద్ర్య రేఖగా నిర్ణయించారు. దీన్ని 2020లో పునరుద్ధరించారు. ఇప్పుడు ఒక వ్యక్తి ఏడాదికి 4,000 యువాన్లు (సుమారు రూ. 46,000) కన్నా తక్కువ సంపాదిస్తుంటే అతన్ని పేదవానిగా పరిగణిస్తున్నారు.

చైనాలో నిరుపేదరికాన్ని పూర్తిగా నిర్మూలించినట్లు 2021 ఫిబ్రవరిలో చైనా అధికారికంగా ప్రకటించింది. 1970వ దశకం తరువాత ప్రపంచ పేదరికం నిర్మూలనలో 70 శాతాన్ని చైనా నిర్మూలించిందని ప్రపంచ బ్యాంకు తెలిపింది.

**జిడిపి:** చైనా తలసరి స్థూల జాతీయ ఆదాయం 200 డాలర్లు (1978) నుండి 10,410 (2019) డాలర్లకు పెరిగింది. ప్రపంచ బ్యాంకు అంచనాల ప్రకారం 2023 నాటికి అది 12,536 డాలర్లతో ఉన్నతాదాయ దేశంగా మారుతుంది. 1978లో చైనా జిడిపి 36,787 కోట్ల యువాన్లు (5,738 కోట్ల డాలర్లు). 2020 నాటికి అది 101.6 లక్షల కోట్ల యువాన్లకు (14.7 లక్షల కోట్ల డాలర్లకు) పెరిగింది. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో 17 శాతం.

చైనాకు 3.2 లక్షల కోట్ల డాలర్ల విదేశీ మారక నిల్వలున్నాయి. ఇవి ప్రపంచంలోనే అత్యధికం. చైనా జిడిపిలో ఎగుమతులు 33 శాతం నుండి 10 శాతానికి పడిపోయినప్పటికీ దాని దగ్గర ఈ విదేశీ మారక నిల్వలు ఉన్నాయి. అంతర్జాతీయ కరెన్సీల్లో యువాన్ నేడు మూడో స్థానంలో ఉంది. ఇప్పుడు యువాన్ రిజర్వు కరెన్సీగా అభివృద్ధి చెందుతున్నది. 70కి పైగా దేశాల సెంట్రల్ బ్యాంకులు యువాన్‌ను రిజర్వు ఆస్తులుగా దాచుకుంటున్నాయి.

2020 నాటికి చైనా జాతీయ తలసరి ఖర్చు చేయగల ఆదాయం 2010తో పోలిస్తే 100.8 శాతం పెరిగింది.

పరిశోధనాభివృద్ధి (ఆర్ అండ్ డి)లో భారీగా పెట్టుబడులు పెట్టడం ద్వారా చైనా సాంకేతిక రంగంలో కొత్త కొత్త ఆవిష్కరణలు చేస్తున్నది.

## చైనాఅమెరికా సంబంధాలు

చైనా సుస్థిరాభివృద్ధిని చూసి అమెరికా బెంబేలెత్తుతున్నది. దాని వల్ల తన ఆధిపత్యానికి ప్రమాదం వస్తుందని భయపడుతున్నది. చైనాను నిలువరించి, ఒంటరిపాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నది.

అమెరికా, చైనా సంబంధాలు ఈ మధ్య కాలంలో ముఖ్యంగా ట్రంప్ చైనాపై ఆంక్షలు విధించిన తరువాత బాగా దెబ్బతిన్నాయి. జోయ్ బైడెన్ ప్రభుత్వం

కూడా తన ముందటి ప్రభుత్వం బాటలోనే నడుస్తున్నది. చైనాను వ్యూహాత్మక శత్రువుగా అమెరికా పరిగణిస్తోంది. 2018, 2020 మధ్య చైనా నుండి అమెరికా దిగుమతులు 10,380 కోట్ల డాలర్ల మేరకు పడిపోయాయి. 2018 జనవరి, సెప్టెంబర్ మధ్య కాలంతో పోలిస్తే 2020 జనవరి, సెప్టెంబర్ మధ్య రెండు దేశాల మధ్య సర్వీసు రంగంలో ద్వైపాక్షిక వాణిజ్యం 35 శాతం పడిపోయింది. అయితే చైనాతో వాణిజ్యాన్ని పూర్తిగా వదులుకునే స్థితిలో అమెరికా లేకపోవడం నేటి వాస్తవికత. 2020లో అమెరికాకు అతి పెద్ద వాణిజ్య భాగస్వామిగా చైనా ఉన్నది. 2020, డిసెంబర్ నాటికి చైనా రుణంలో అమెరికా పెట్టుబడిదారులు 10,000 కోట్ల డాలర్ల వాటా కలిగి ఉన్నారు. వారు చైనా ఈక్విటీ మార్కెట్‌లో 1.1 లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టారు. చైనా పెట్టుబడిదారులు అమెరికా రుణంలో 1.4 లక్షల కోట్ల డాలర్ల వాటా కలిగి ఉండగా, అమెరికా ఈక్విటీ మార్కెట్‌లో 72,000 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టారు.

రెండు దేశాల సీనియర్ దౌత్యాధికారుల మధ్య రెండు దఫాల చర్చలు జరిగాయి. కానీ ఈ చర్చల్లో గణనీయమైన పురోగతి ఏమీ లేదు. ఆర్థికాంశాలతోపాటు, చైనాలోని హాంగ్‌కాంగ్, సిన్జియాంగ్, తైవాన్, దక్షిణ చైనా సముద్రం సమస్యలు, చైనా సైబర్ యుద్ధంలో పాల్గంటున్నదన్న ఆరోపణలు ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. చతుష్ట కూటమి (క్వాడ్)ను స్థిరపరచడం, ఐరోపాలోని తన సంప్రదాయ మిత్రులను సమీకరించడం ద్వారా అమెరికా చైనాను ఒంటరిపాటు చేయడానికి ప్రయత్నిస్తోంది. తన ఐరోపా మిత్రులను తిరిగి దగ్గరకు తీసుకోడానికి అమెరికా వాటితో తనకు గల విబేధాలను పరిష్కరించుకున్నది, వాటిపై ఆంక్షలు ఎత్తివేసింది. భారత దేశాన్ని క్వాడ్‌లోకి తీసుకోవడం, దాన్ని సైనికంగా తనపై ఆధారపడేట్లు చేసుకోవడం ఇవనీ కూడా చైనాను నిలువరించి, ఒంటరిపాటు చేయాలన్న అమెరికా వ్యూహంలో భాగమే.

**జి–7 శిఖరాగ్ర సభ:** 2021 జూన్‌లో జరిగిన జి–7 శిఖరాగ్ర సభను అమెరికా చైనాను ఒంటరిపాటు చేయాలన్న తన ఎజెండా అమలుకోసం వినయోగించుకుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మౌలిక వసతుల అభివృద్ధి పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు శిఖరాగ్ర సభ ప్రకటించింది. చైనా బెల్ట్ అండ్ రోడ్ కార్యక్రమానికి పోటీగా ఈ శిఖరాగ్రసభ 'మెరుగైన ప్రపంచాన్ని తిరిగి నిర్మిందం' అనే పథకాన్ని ప్రారంభించింది. అయితే ఈ పథకం అమలుకు నిర్దిష్టంగా నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించలేదు. అయితే అమెరికా యొక్క ఐరోపా మిత్రులకున్న

వైరుధ్యభరితమైన ప్రయోజనాలనూ, చైనాతో సంబంధాలనూ దృష్టిలో పెట్టుకున్నప్పుడు ఐరోపా మిత్రుల నుండి నిర్నిబంధమైన మద్ధతు లభిస్తుందన్న అమెరికా ఆశ నెరవేరక పోవచ్చు.

జి-7 శిఖరాగ్ర సభ వెనువెంటనే జరిగిన నాటో శిఖరాగ్ర సభ మొట్టమొదటి సారిగా తన ప్రకటనలో చైనాను తమ భద్రతకు ముప్పుగా పేర్కొన్నది. చైనాను తన ప్రపంచాధిపత్యానికి ముప్పుగా అమెరికా పరిగణిస్తోంది. అందుకనే దాన్ని ఒంటరిపాటు చేయడం కోసం తన సంప్రదాయ మిత్రుల నమ్మకాన్ని చూరగొనడానికి ప్రయత్నిస్తోంది.

**చైనా-ఇయు సంబంధాలు:** అయితే చైనా విషయంలో అమెరికాతో పూర్తిగా అంటకాగడానికి జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ వంటి దేశాలు అంతగా ఆసక్తి కనబరచడం లేదు. అమెరికా అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ 2020 డిసెంబర్‌లో యూరోపియన్ యూనియన్, చైనాలు 'పెట్టుబడులపై సమగ్ర ఒప్పందానికి' (సిఎఐ) వచ్చాయి. ఈ ఒప్పందం తమకు ప్రయోజనకరమని జర్మనీ, ఫ్రాన్స్‌లోని అనేక బడా కంపెనీలు భావిస్తున్నాయి. ఈ ఒప్పందానికి మద్దతిస్తున్నాయి. అందువల్ల ప్రపంచ రాజకీయాలను తీర్చిదిద్దడంలో ఐరోపా యూనియన్ ఒక స్వతంత్రమైన, ప్రధాన మైన పక్షమని అమెరికాకు దీనిద్వారా సందేశం అందుతోంది.

జి-7, నాటో శిఖరాగ్ర సభలు ముగిసిన వెనువెంటనే జర్మన్ ఛాన్సలర్ మార్కెల్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌లు చైనా అధ్యక్షుడు సి జిన్‌పింగ్‌తో చర్చలు జరిపారు. ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను ఎదుర్కోవడంలో చైనా ఐరోపాలు తమ సహకారాన్ని మరింత విస్తరించుకుని పనిచేయగలవని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికాకోరుతున్నట్లు, ఒత్తిడి తెస్తున్నట్లు చైనాతో విడగొట్టుకోడానికి జర్మనీ, ఫ్రాన్స్‌లు ఆసక్తికరంగా లేవు. చైనాతో అమెరికాకు ఘర్షణ వస్తే అమెరికా వైపు ఉండకూడదని జర్మనీలో నాలుగింట మూడొంతుల మంది ప్రజలు భావిస్తున్నట్లు ప్రజాభిప్రాయ సేకరణలో తేలింది.

అయితే మానవ హక్కుల సమస్యపై ఇయు, కెనడా, బ్రిటన్‌లతో కలిసి అమెరికా వ్యవహరిస్తోంది. సింజియాంగ్ రాష్ట్రంలో మానవ హక్కుల ఉల్లంఘన పేరుతో ఈ దేశాలన్నీ కలిసి మార్చిలో చైనా అధికారులపై ఆంక్షలు విధించాయి. హాంగ్‌కాంగ్‌లో మానవహక్కులు ఉల్లంఘించారన్న ఆరోపణపై జులై మాసంలో మరోసారి ఐరోపా యూనియన్ హాంగ్‌కాంగ్, చైనా అధికారులపై ఆంక్షలు విధించింది.

చైనా కూడా ఐరోపా యూనియన్‌కు చెందిన కొందరు వ్యక్తులు, కొన్ని సంస్థలపై ఆంక్షలు విధించడం ద్వారా ప్రతీకార చర్యలు తీసుకుంది. దీంతో ఐరోపా వ్యాపార మండలి బెంబేలెత్తింది.

దాని ఫలితంగా ఐరోపా పార్లమెంటు సిఎఐ ఒప్పందాన్ని ఆమోదించలేదు. ఇటువంటి ఒప్పందాలన్నీ ఐరోపా పార్లమెంటులో ఏకగ్రీవంగా ఆమోదించాల్సి ఉంది.

**అమెరికారష్యా శిఖరాగ్ర సభ**

జి–7 శిఖరాగ్ర సభ జరిగిన వెంటనే అమెరికా, రష్యా అధ్యక్షులు జెనీవాలో సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రమైన తరుణంలో ఈ సమావేశం జరిగింది. ఇయు తూర్పు సరిహద్దులకు నాటోను విస్తరించడం, రష్యాపై ఆంక్షలు విధించడం, రెండు దేశాల మధ్య రాయబారులను ఉపసంహరించుకోవడం, బాల్టిక్ సముద్రంలో అమెరికా యుద్ధ నౌకలు తిరగడం, రష్యా సరిహద్దుల్లో సైనిక విన్యాసాలు, దశాబ్దాల క్రితం సంతకాలు చేసిన ఆయుధ ఒప్పందాలను పునరుద్ధరించడానికి నిరాకరించడం, సైబర్ దాడుల ఆరోపణలు, అమెరికా అధ్యక్ష ఎన్నికలను ప్రభావితం చేయడం వంటి అనేక వివాదాస్పద సమస్యలు రెండు దేశాల మధ్య ఉన్నాయి. రెండు దేశాల రాయబారులను పునరుద్ధరించడం, చర్చలను ఇక ముందు కూడా కొనసాగించడం అనే అంశాలమీద అంగీకారం కుదిరింది మినహా ఇతర అంశాలపై శిఖరాగ్రసభలో ఎటువంటి పురోగతి లేదు. రష్యా, చైనాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం అభివృద్ధి చెందుతున్నందున ఈ రెండు దేశాల మధ్య అంతరం సృషించడానికే అమెరికా ఈ శిఖరాగ్ర సహను ఏర్పాటు చేసింది.

రష్యా విషయంలో ఐరోపా యూనియన్‌లో చీలికలు ఉన్నాయి. జర్మనీ, ఫ్రాన్స్‌లు రష్యాతో చర్చలు జరపడానికి సిద్ధంగా ఉన్నాయి. జర్మనీ తన ఇంధన అవసరాల కోసం రష్యాతో కుదుర్చుకున్న గ్యాస్ పైప్‌లైన్ ఒప్పందం విషయంలో ముందుకు పోదలచుకుంది. ఈ ప్రాజెక్టు విషయంలో జర్మనీ ముందుకు వెళ్లకుండా చేయడానికి అమెరికాశత విధాలా ప్రయత్నించింది కానీ ఫలితం సాధించలేదు.

**లాటిన్ అమెరికా**

**క్యూబా మీద సరికొత్త దాడులు:** సోషలిస్టు క్యూబా మీద అమెరికా తన

దాడులను తీవ్రం చేసింది. ఈ దాడులు సాగించడానికి అది కోవిడ్-19 మహమ్మారిని అవకాశంగా తీసుకుంది. ప్రభుత్వ స్పాన్సర్డ్ ఉగ్రవాద దేశాల లిస్టులో క్యూబాను అమెరికా చేర్చింది. క్యూబా అష్టదిగ్బంధనాన్ని మరింత బిగించేందుకు ట్రంప్ 243 రకాల చర్యలు చేపట్టారు. బైడెన్ వీటిని కొనసాగిస్తున్నారు.

గత ఏడాది క్యూబా ఆర్థిక వ్యవస్థ 11 శాతం కుంచించుకుపోయింది. ఆంక్షల వల్ల ఆహారం, చమురు, మందులు వంటి నిత్యావసరాలతో సహా అనేక వస్తువులకు కొరత ఏర్పడింది. క్యూబాలో ఔషదాల సరఫరాకూ, తీవ్రంగా జబ్బుపడిన రోగులకు ఉపయోగించే కీలకమైన పరికరాల దిగుమతులకూ అవసరమైన 200 కోట్ల డాలర్లను వినియోగించుకోకుండా ఆంక్షలు అడ్డుపడ్డాయి.

ఈ అడ్డంకులన్నిటినీ అదిగమించి క్యూబా నేడు కోవిడ్ నివారణకోసం అయిదు రకాల వ్యాక్సిన్‌లు ఉత్పత్తి చేసే క్రమంలో ఉంది. వీటిలో సోబెరానా 02, అబ్దాలా అనే రెండు వ్యాక్సిన్‌లు 90 శాతం సామర్థ్యంతో పనిచేస్తున్నాయి.

నిత్యావసర వస్తువుల కొరతతో ప్రజలు ఆహారం, విద్యుత్తు, మందుల కోసం వీధుల్లోకి వచ్చి ప్రదర్శనలు చేశారు. వీటికి అమెరికా సహాయ, సహకారాలు అందించింది. క్యూబా ప్రభుత్వమూ, క్యూబా కమ్యూనిస్టు పార్టీ (పిసిసి) రెండూ వెంటనే స్పందించి ఈ కష్టాల వెనుకనున్న కారణాలను ప్రజలకు వివరించాయి. క్యూబా విప్లవానికి, సోషలిజానికి మద్దతుగా లక్షలాది మంది ప్రజలు బ్రహ్మాండమైన ప్రదర్శనలు జరిపారు. పరిస్థితి అదుపులోకి వచ్చినప్పటికీ దేశాన్ని అస్థిర పరచడం కోసం సామ్రాజ్యవాదులు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టడానికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని క్యూబా కమ్యూనిస్టు పార్టీ, ప్రభుత్వమూ ప్రజలకు విజ్ఞప్తి చేశాయి. గత 60 సంవత్సరాలుగా క్యూబాపై విధించిన అమానవీయ దిగ్బంధనాన్ని ఎత్తి వేయాలని అవి అమెరికాను డిమాండ్ చేశాయి.

## వామపక్ష పునరుజ్జీవన సూచనలు

**పెరూ:** పెరూ అధ్యక్ష ఎన్నికల్లో వామపక్షాలు గణనీయమైన విజయాలు సాధించాయి. మితవాద నయా-ఉదారవాది అయిన కీకో ఫెజిమోరిని ఓడించి అభివృద్ధికర పాఠశాల ఉపాధ్యాయుడు, సామాజిక కార్యకర్త అయిన పెడ్రో కాస్టిల్లో అధ్యక్షుడుగా గెలుపొందారు. గత నాలుగేళ్లలో పెరూలో నలుగురు అధ్యక్షులు మారారు. ఒకరు ఓట్లు కొనుగోలు చేసిన కుంభకోణంలో రాజీనామా చేశారు. మరొకరు అవిశ్వాస తీర్మానంలో ఓడిపోయి దిగిపోయారు. మూడో అధ్యక్షుడు

పదవి స్వీకరించిన వారంలోనే గద్దె దిగారు. నాలుగో వ్యక్తి ఇప్పుడు పాలిస్తున్న తాత్కాలిక అధ్యక్షుడు. ఆయన ఎన్నికలను పర్యవేక్షించారు. అధ్యక్షునిగా గెలుపొందిన కాస్టిల్లో పేద ప్రజల ఎజెండాతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శక్తివంతమైన గనుల సంస్థలపై పన్నులు పెంచుతామనీ, విదేశీయుల చేతుల్లో ఉన్న అన్ని గనుల ప్రాజెక్టులను స్వాధీనం చేసుకుంటామనీ, నియంతృత్వ కాలంలోని నయా-ఉదారవాద రాజ్యాంగాన్ని తిరగ రాసేందుకు రిఫరెండం నిర్వహిస్తామనీ, మూలవాసి ప్రజలు, మహిళలు, రైతుల హక్కులు కాపాడతామనీ, మానవ హక్కులకు ప్రాధాన్యతనిస్తామనీ, విద్యకు బడ్జెట్ కేటాయింపులు పెంచుతామనీ ఆయన హామీలు ఇచ్చారు.

**చిలీ:** చిలీలో కొత్త రాజ్యాంగం రాసే రాజ్యాంగ సభకు 155 మంది సభ్యులను ఎన్నుకున్నారు. వీరితోపాటు రాష్ట్రాల గవర్నర్లు, మేయర్లు, కౌన్సిలర్లకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో మితవాత పార్టీ అభ్యర్థులు ఊడ్చుపెట్టుకు పోయారు. కొత్తగా ఎన్నికైన రాజ్యాంగ సభలో వామపక్ష, నయా-ఉదారవాద వ్యతిరేక శక్తులు ఆధిక్యత సాధించాయి. ప్రస్తుత రాజకీయ వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

**బ్రెజిల్:** ప్రస్తుత అధ్యక్షుడు జైర్ బోల్సనారోకు వ్యతిరేకంగా బ్రెజిల్ దేశ వ్యాపితంగా నిరసనలు మరింత తీవ్రమయ్యాయి. కోవిడ్-19 మహమ్మారిని కట్టడిచేయడంలో ప్రభుత్వ వైఫల్యం, పెరుగుతున్న ఆకలి, నిరుద్యోగం ప్రధాన సమస్యలు. మాజీ అధ్యక్షుడు లూలాపై ఉన్న ఆరోపణలన్నిటినీ కోర్టులు కొట్టివేశాయి. 2022లో జరిగే అధ్యక్ష ఎన్నికల పోటీలో లూలా ముందు పీఠిన ఉన్నారు. లూలా ఎన్నికైతే లాటిన్ అమెరికాపై దాని ప్రభావం పెద్దగా ఉంటుంది. వామపక్ష, పురాగామి శక్తులకు ఇది మరోసారి ఊపునిస్తుంది.

**కొలంబియా:** ఏప్రిల్ నుండి కొలంబియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున కార్మికుల సమ్మెలు జరుగుతున్నాయి. తొలుత ప్రభుత్వం పెంచిన పన్నులకు నిరసనగా ప్రారంభమైన సమ్మెలు క్రమంగా నయా-ఉదారవాద వ్యతిరేక, మితవాద ప్రభుత్వ వ్యతిరేక సమ్మెలుగా మారిపోయాయి. ఈ నిరసనలకు వామపక్షాలు నాయకత్వం వహిస్తున్నాయి.

**ఈక్వెడార్:** ఈక్వెడార్‌లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో వామపక్షం ఓటమి చవిచూసింది. అయితే అది పార్లమెంటులో పెద్ద పార్టీగా ఆవిర్భవించింది.

**వెనిజులా:** అమెరికా విధించిన ఆంక్షల మూలంగా వెనిజులా చెప్పనలవి కాని కష్టాలను ఎదుర్కొంటోంది.

ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెందిన కోవాక్స్ సదుపాయం ద్వారా కోవిడ్ వాక్సిన్ కొనడానికి వెనిజులా చేసిన చివరి చెల్లింపులను ఒక స్విస్ బ్యాంకు అడ్డుకున్నది. దాంతో వెనిజులాకు వాక్సిన్ సరఫరా ఆగిపోయింది. విదేశాల్లో వెనిజులా ఆస్తులను అమెరికా ట్రెజరీ శాఖ అడ్డుకోవడమో, లేక స్వాధీనం చేసుకోవడమో చేసింది. మందులు లేక, చికిత్సలు లేక వేలాది మంది ప్రజలు కష్టాలపాలయ్యారు. వెనిజులా చమురు, విద్యుత్తు ఉత్పత్తులను విధ్వంసం చేయడం, సాయుధ మిలీషియాలను ప్రోత్సహించడం, దేశంలో సామాజిక, ఆర్థిక అరాచకాన్ని సృష్టించేందుకు ప్రతిపక్షాలను ఉసికొల్పడం వంటి దుశ్చర్యలకు అమెరికా పాల్పడుతోంది. వెనిజులా తీవ్రమైన ఆహార కొరతను, నిత్యావసరాలు, ఇంధన కొరతలను ఎదుర్కొంటున్నది. వెన్నువిరిచే ఈ ఆంక్షల నడుమ కూడా వెనిజులా తన సామాజిక సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నది.

ప్రతిపక్ష పార్టీలతో చర్చించడానికి తాను సిద్ధంగా ఉన్నానని అధ్యక్షుడు నికొలాస్ మదురో ప్రకటించారు. మెక్సికోలో ఈ చర్చలు జరగాల్సి ఉంది. 2021 నవంబర్‌లో జరిగే వివిధ స్థానిక సంస్థలు, రాష్ట్రాల ఎన్నికల్లో పాల్గనాలని ప్రభుత్వం ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేస్తోంది.

## ఉత్తరాఫ్రికాపశ్చిమాసియా

**పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు:** గాజా, పాలస్తీనాలపై ఇజ్రాయిల్ చేసిన నిరంతర బాంబు దాడుల్లో మహిళలు, పిల్లలతో సహా అనేక మంది పాలస్తీనియన్లు మరణించారు. తూర్పు జరూసలెంను పూర్తిగా ఆక్రమించుకోవాలన్న దుర్బుద్ధితో ఇజ్రాయిల్ ఉంది. పాలస్తీనియన్లు నివసించే ప్రాంతాల్లో యూదు సెటిల్‌మెంట్లను తీవ్రతరం చేస్తోంది. ఈ క్రమంలో షేక్ జర్రా ప్రాంతం నుండి స్థానికులను తొలగించడానికి ఇజ్రాయిల్ అధికారులు చేసిన ప్రయత్నాలను ప్రతిఘటించిన నిరసన కారులపై అది పాశవిక దాడులకు పాల్పడింది. పవిత్ర రంజాన్ సందర్భంలో ఆల్–అక్సా మసీదుపై ఇజ్రాయిల్ దళాలు దండెత్తి వందలాది మంది ప్రజలను గాయపరిచాయి. ఈ మసీదు ముస్లింలకు మూడవ అతి పవిత్ర స్థలం. పచ్చి మితవాద నెతన్యాహూ నాయకత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాలకోసం ఈ దాడులకు పాల్పడింది.

ఎన్నికల్లో నెతన్యాహూ ఓడిపోయి నఫ్తాలి బెన్నెట్ నాయకత్వంలోని కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటికీ దాని పాలస్తీనా విధానంలో మార్పుల లేదు. ఇజ్రాయిల్‌లో నివసిస్తున్న పాలస్తీనియన్లకు వాక్సిన్‌లు కూడా ఇవ్వడం లేదు. 1967 సరిహద్దులతో, తూర్పు జరూసలెం పాలస్తీనా రాజధానిగా రెండు దేశాల ఏర్పాటుకు ఇజ్రాయిల్ అంగీకరించే వరకు శాంతి నెలకొనదు.

**అరబ్ దేశాల ధోరణి:** అమెరికా ఒత్తిడి, ఆకర్షణీయమైన ఒప్పందాలతో 2020లో నాలుగు అరబ్ దేశాలు – యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, మొరాకో, సూడాన్, బహ్రెయిన్‌లు ఇజ్రాయిల్‌తో సాధారణ సంబంధాలు పునరుద్ధరించుకున్నాయి. ఇజ్రాయిల్‌తో యుఎఇ సంబంధాలు పునరుద్ధరించుకోడానికి అమెరికా మధ్య వర్తిత్వం వహించి అబ్రహాం ఒప్పందాన్ని కుదిర్చింది. సౌదీ అరేబియా ఈ ఒప్పందంపై సంతకాలు చేయనప్పటికీ అది నెమ్మదిగా ఇజ్రాయిల్‌తో సంబంధాలు పునరుద్ధరించుకుంటోంది. ఈ ఒప్పందాలను పాలస్తీనీయన్లు వ్యతిరేకిస్తున్నారు. ఈ దేశాలన్నీ ఇజ్రాయిల్‌తో సంబంధాలు పునరుద్ధరించుకున్నాయి గనుక గాజాపై ఇజ్రాయిల్ దాడులను ఈ దేశాల్లోని పెద్ద నాయకుడెవరూ ఖండించలేదు. ఆ విధంగా వాళ్లు స్వతంత్ర పాలస్తీనా దేశం ఏర్పడే వరకు ఇజ్రాయిల్‌తో సంబంధాలు పునరుద్ధరించుకోబోమని అరబ్బు శాంతి ప్రతిపాదనలో ఇచ్చిన హామీ నుండి వెనక్కు పోయారు.

షియా, సున్నీల మధ్య విబేధాలను అమెరికా తన స్వార్థం కోసం వినియోగించుకుంటోంది. షియాలు మెజారిటీగా గల ఇరాన్ ఈ దేశాలన్నిటికీ ఉమ్మడి శత్రువుగా ముద్రిస్తూ దానికి వ్యతిరేకంగా ఈ దేశాలు ఇజ్రాయిల్‌తో ఐక్యం కావాలని కోరుతోంది. పశ్చిమాసియాలో ఈ విచ్ఛిన్నకర ప్రయత్నాల వల్ల దేశాల లోపల, దేశాల మధ్య ఘర్షణలు జరిగి తీరుతాయి.

**ఇరాన్‌లో కొత్త అధ్యక్షుడు, అణు చర్చలు:** ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఇబ్రహీమ్ రైజీ ఇరాన్ కొత్త అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. ఎన్నికల్లో ఓటర్లు చాలా తక్కువ శాతం (49 శాతం) పాల్గొన్నారు. దేశంలో ఆర్థిక ఈతిబాధలు, ఆహారం, ఇంధన ధరల పెరుగుదలపై ప్రజల్లో నిరసన పెరిగింది. అందువల్లనే చాల మంది ఓటర్లు ఎన్నికల్లో నిరసన తెలుపుతూ బ్యాలెట్ పత్రాలను పాడుచేశారు.

ఇరాన్‌తో ఏప్రిల్‌లో ప్రారంభమైన వియెన్నా అణు చర్చలు ఆగిపోయాయి. ఇప్పుడు రైసీ అధ్యదుగా పదవి స్వీకరించడంతో అవి ఆగస్టు 3కు వాయిదా పడ్డాయి. అమెరికా ఒప్పందానికి కట్టుబడి ఉండాలనీ, ట్రంప్ ప్రభుత్వం చేసినట్లు

ఒప్పందం నుండి ఉపసంహరించుకోనని మాట ఇవ్వాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది.

### రాజకీయ కల్లోలం

కరోనా మహమ్మారి, దాని వల్ల సంభవించిన విధ్వంసం మొత్తం పశ్చిమాసియా ప్రాంతంపై ప్రభావం చూపించింది. తీవ్రమైన నిరుద్యోగం, పెరుగుతున్న ధరలు, ఆర్థిక ఈతిబాధల పట్ల నిరసనలు, రాజకీయ కల్లోలాలు పెరుగుతున్నాయి. ఇరాన్, లెబనాన్, ట్యునీషియా ఇతర దేశాల్లో ఈ పరిస్థితి ఉంది.

**ఇరాక్:** ఈ ఏడాది చివరికి ఇరాక్ నుండి తన సైన్యాన్ని ఉపసంహరించుకుంటానని అమెరికా ప్రకటించింది. ఈ మేరకు ఇరాక్‌ను ఆక్రమించిన 18 ఏళ్ల తరువాత ఒక ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఇరాక్‌లో నేడు నాలుగింట మూడొంతుల మంది దారిద్ర్య రేఖ దిగువన జీవిస్తున్నారు. మిలీషియాలు, సాయుధ గ్రూపులు పెరిగిపోవడం, మతపరమైన ఘర్షణలు, హత్యలు ఎక్కువ కావడం, దేశంలోని మూడో వంతు భూ భాగాన్ని ఉగ్రవాద గ్రూపులు అధీనం చేసుకోవడంతో నేడు ఆ దేశం విధ్వంసం కావించబడింది. త్వరగా ఎన్నికలు నిర్వహించాలనీ, మొత్తం రాజకీయ, ఆర్థిక వ్యవస్థను ప్రక్షాళన చేయాలని, ఆర్థిక, పరిపాలనా పరమైన అవినీతికి అంతం పలకాలని, నిరుద్యోగాన్ని నిర్మూలించాలని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలని ఇరాక్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఈ ఏడాది అక్టోబర్‌లో ఎన్నికలు జరుగుతాయని ఇరాక్ ప్రభుత్వం ప్రకటించింది. ఎన్నికలు నిర్వహించడానికి 52 లక్షల డాలర్ల సహాయం అందిస్తానని అమెరికా హామీ ఇచ్చింది. దేశంలో న్యాయమైన, శాంతియుతమైన ఎన్నికలు నిర్వహించడానికి పరిస్థితులు అనుకూలంగా లేవని అందువల్ల ఈ ఎన్నికల్లో పాల్గన కూడదని ఇరాక్ కమ్యూనిస్టు పార్టీ తన సభ్యులలో అభిప్రాయ సేకరణ జరిపించిన అనంతరం నిర్ణయించింది.

**లెబనాన్:** లెబనాన్ చరిత్రలో ఎన్నడూ ఎరుగని తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. 1800వ శతాబ్దం తరువాత ప్రపంచంలో ఏ దేశమూ ఎదుర్కోని తీవ్రమైన సంక్షోభాన్ని ఈ దేశం నేడు ఎదుర్కొంటున్నదని ప్రపంచ బ్యాంకు చెప్పింది. లెబనాన్‌లోని 77 శాతం ప్రజల దగ్గర తినడానికి తిండిగానీ, తిండి కొనుక్కోడానికి

డబ్బుగానీ లేదని యునిసెఫ్ తెలిపింది. బ్యాంకులు డబ్బు విత్‌డ్రా లను స్తంభింపజేశాయి. మందుల దుకాణాల్లో ఔషధాలు ఒట్టిపోయాయి. ఈ దేశంలో 2019లో జిడిపి 6.7 శాతం క్షీణించిపోగా, 2020లో మరింత ఘోరంగా 20.3 శాతం క్షీణించిదని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది. డాలర్ల లెక్కలో దేశ తలసరి జిడిపి 40 శాతం క్షీణించింది. జనాభాలో సగానికి పైగా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారు. నిరుద్యోగం అతి తీవ్రంగా పెరుగుతున్నది.

బీరుట్ పోర్టులో భారీ పేలుడు వల్ల తీవ్రమైన విధ్వంసం జరిగిన తరువాత ప్రభుత్వం రాజీనామా చేసింది. అప్పటి నుండి దేశంలో తీవ్ర అస్థిరత ఏర్పడింది. ఎవరూ ప్రభుత్వం ఏర్పరచలేకపోతున్నారు. వరుసగా ఇద్దరు ప్రధాన మంత్రులను నియమించారు. ఫ్రెంచ్ ప్రభుత్వం (లెబనాన్ మాజీ వలస పాలకులు) జోక్యం చేసుకుని దాని రాజకీయ, ఆర్థిక విధానాలను తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నది.

**ట్యునీషియా:** ట్యునీషియాలోని అనేక రాష్ట్రాల్లో హింసాత్మక నిరసనలు జరిగాయి. దేశంలో ఆరోగ్య, ఆర్థిక,సామాజిక పరిస్థితులు దిగజారడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రాజీనామా చేసి, పార్లమెంటును రద్దు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ట్యునీషియా అధ్యక్షుడు హిచెమ్ మెచిచి దేశ ప్రధాన మంత్రిని ఆ పదవి నుండి తప్పించారు. పార్లమెంటు కార్యకలాపాలన్నిటినీ రద్దు చేశారు. ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకున్నారు. పార్లమెంటు సభ్యులకు చట్టం కల్పిస్తున్న రక్షణలన్నిటినీ రద్దు చేశారు. దీని వల్ల ఆర్థిక సంక్షోభానికి కారణాలపై దర్యాప్తు జరపడానికి మార్గం సుగమమైంది.

## దక్షిణాసియా

**ఆఫ్ఘనిస్తాన్:** గత సంవత్సరం తాలిబాన్లతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం అమెరికా ఆఫ్ఘనిస్తాన్ నుండి సైనిక దళాలను ఉపసంహరించుకోవడం ప్రారంభించింది. అమెరికా-నాటో దళాల ఉపసంహరణ 90 శాతం పైగా పూర్తయింది. ఆగస్టు 31 నాటికి పూర్తిగా ఉపసంహరించుకుంటాయి. ఇది అమెరికా జరిపిన సుదీర్ఘ యుద్ధాల్లో ఒకటి. దీని వల్ల అమెరికాకు 20 ఏళ్లలో 2 లక్షల కోట్ల డాలర్ల ఖర్చయింది. ఆఫ్ఘనిస్తాన్‌కు గల వ్యూహాత్మక ప్రాముఖ్యత దృష్ట్యా అమెరికా ఆ దేశం నుండి పూర్తిగా ఉపసంహరించుకోడానికి సిద్ధంగా లేదు. అందుకనే అది ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, ఉజ్బెకిస్తాన్, అమెరికాలతో కలిసి 'మధ్య ఆసియా

చతుష్ట కూటమి' (క్వాడ్)ను ఏర్పాటు చేసింది. ఆఫ్ఘనిస్తాన్‌పై తన పట్టు కోల్పోకుండా ఉంచడం కోసం, మధ్య ఆసియాలో చైనా, రష్యాల ప్రభావాన్ని ఎదుర్కోడానికీ ఈ పని చేసింది.

అమెరికా దళాలు ఉపసంహరిస్తుండడంతో తాలిబాన్లు దేశంలోని చాలా ప్రాంతంపై తమ పట్టును శీఘ్రంగా బిగిస్తున్నారు. అనేక ప్రాంతాలను త్వరత్వరగా ఆక్రమించుకుంటున్నారు, వ్యూహాత్మక సరిహద్దులను స్వాధీనం చేసుకుంటున్నారు. అనేక రాష్ట్రాల రాజధానులను ఆక్రమించే ప్రమాదం ఏర్పడింది.

ప్రస్తుత ఆఫ్ఘనిస్తాన్ ప్రభుత్వం అధికారాన్ని పంచుకునే ఒప్పందం కోసం దోహాలో తాలిబాన్లతో చర్చలు జరుపుతోంది. ప్రభుత్వం గద్దె దిగాలని తాలిబాన్లు డిమాండ్ చేస్తున్నారు.

అనేక మధ్య ఆసియా దేశాలకు ఆఫ్ఘనిస్తాన్‌తో సరిహద్దులున్నాయి. ఆ దేశాలు ఈ పరిణామాల పట్ల, తాలిబాన్ల శీఘ్ర పురోగమనం పట్ల ఆందోళన చెందుతున్నాయి. రష్యా తాలిబాన్లతో అనేక దఫాలు చర్చలు జరిపింది. ఆఫ్ఘన్ భూభాగం మీద నుండి రష్యాపైగానీ, పొరుగు దేశాలపైన గానీ దాడులకు అనుమతివ్వబోమని తాలిబాన్లు హామీ ఇచ్చారు.

తాలిబాన్ నాయకత్వంతో చైనా చర్చలు జరిపి కొంత అవగాహనకు వచ్చింది. అదే విధంగా ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దుల్లో ఉన్న ఇరాన్ కూడా తాలిబాన్లతో చర్చలు జరిపి తమ దేశ ఆందోళనలను వివరించింది. తాలిబాన్లకు మద్దతిచ్చిన పాకిస్తాన్ నేటి పరిణామాల్లో కీలకమైన పాత్ర నిర్వహించే అవకాశముందని అందరూ గుర్తిస్తున్నారు.

**వేరుపడిన భారత్:** అమెరికాను నమ్ముకుని దాని చెంగుపట్టుకు తిరిగిన భారత దేశం ఆఫ్ఘనిస్తాన్ విషయంలో పూర్తిగా వేరపడిపోయింది. మన ప్రభుత్వం తాలిబాన్ల 'చట్టబద్దత' అంశాన్ని లేవనెత్తడం ద్వారా ఆఫ్ఘనిస్తాన్‌లో నేడు జరుగుతున్న పరిణామాల్లో మరింత వేరుపడిపోయింది. అమెరికా ఏర్పాటు చేసిన మధ్య ఆసియా 'క్వాడ్'లో కూడా భారత దేశానికి స్థానం లేకుండా పోయింది. తాలిబాన్లతో సంప్రదింపుల కోసం భారత దేశం రంగంలోకి దిగేటప్పటికే అంతా అయిపోయింది. మన దేశం అమెరికా–తాలిబాన్ సంబంధాల మీద ఆధారపడి చర్యలు తీసుకోవడం జరిగింది.

**దక్షిణాసియా వేదిక:** సార్క్ లోని మొత్తం ఎనిమిది దేశాల్లో అయిదు దేశాలు చైనా చొరవతో ప్రారంభమైన చైనా–దక్షిణాసియా దేశాల పేదరికం

నిర్మూలన, సహకార అభివృద్ధి కేంద్రంలో చేరడంతో భారత్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. 2021 ఏప్రిల్‌లో చైనా, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్, పాకిస్తాన్, శ్రీలంక విదేశాంగ మంత్రుల సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం జులై నెలలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

**సార్క్:** 2014 తరువాత సార్క్ శిఖరాగ్ర సభ జరగలేదు. 2016 సార్క్ శిఖరాగ్ర సభలో పాల్గనడానికి భారత దేశం అంగీకరించకపోవడంతో ఈ క్రమం దాదాపు అంతమై పోయింది. సార్క్‌ను పునరుద్ధ రించడానికి భారత ప్రభుత్వం సుముఖంగా లేదనీ, దానికి బదులుగా ఇటీవల ఏర్పాటు చేయబడిన బంగాళా ఖాత ప్రాంత దేశాల సాంకేతిక ఆర్థిక సహకార గ్రూపు (బిమ్‌స్టెక్) పట్ల ఆసక్తి కలిగి ఉందన్న అభిప్రాయం ప్రబలంగా ఉంది. బంగాళాఖాతం చుట్టూ ఉన్న దేశాలతో ఈ గ్రూపు ఏర్పడింది. భారత ప్రభుత్వం ఇటీవల చేపట్టిన 'వాక్సిన్ దౌత్యం' బెడిసి కొట్టడంతో మన పొరుగున ఉన్న అనేక దేశాలు మనకు దూరమైనాయి. ఈ దేశాలకు చైనా సహాయం చేసింది. భారత్ మినహా ఇతర దక్షిణాసియా దేశాలన్నిటికీ అది వాక్సిన్ సరఫరా చేసింది. ఈ చర్యల వల్ల భారత దేశం ఇరుగు పొరుగు దేశాల నుండి ఎంతోకొంత ఒంటరిపాటు అయింది.

**నేపాల్:** నేపాల్‌ను ఆవహించిన రాజకీయ సంక్షోభానికి తెరదించాలని సుప్రీం కోర్టును కోరడంతో అది షేర్ బహదూర్ దేవుబా ను ప్రధాన మంత్రిగా నియమించింది. నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (ఎన్‌సిపి)లో ఏర్పడిన ముఠా తగాదాల వల్ల పార్లమెంటులో స్వంత పార్టీ సభ్యులే కెపి ఓలి ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకునే పరిస్థితి ఏర్పడింది. దాంతో ఆయన రాజీనామా చేసి పార్లమెంటును రద్దు చేశారు. అది మొదటి సారిగా గత ఏడాది డిసెంబర్ 20న రద్దు చేయబడింది. రద్దు నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని చెబుతూ ఫిబ్రవరి 23న సుప్రీం కోర్టు తిరిగి దాన్ని పునరుద్ధరించింది. మే 10 జరిగిన విశ్వాస తీర్మానంలో ఓలి ఓడిపోయారు. ఆయన పక్షాన 93 మంది పార్లమెంటు సభ్యులు మాత్రమే నిలబడ్డారు. దాంతో ఆయన మళ్లీ పార్లమెంటు రద్దుకు సిఫార్సు చేశారు. సుప్రీం కోర్టు మళ్లీ దాన్ని తిరస్కరించి దేవుబాను ప్రధాన మంత్రిగా నియమించాలని అధ్యక్షురాలిని ఆదేశించింది. విశ్వా తీర్మానంపై జరిగిన ఓటింగులో దేవుబా పార్లమెంటులో మెజారిటీని నిరూపించుకున్నారు. పార్లమెంటులో జరిగిన ఓటింగులో మొత్తం 271 మంది సభ్యులకు గాను 165 మంది అంటే 60 శాతం మంది సభ్యులు ఆయనకు అనుకూలంటా ఓటు వేశారు. వీరిలో 22 మంది

సభ్యుల సిపిఎన్(యుఎంఎల్) చీలిక ముఠా కూడా ఉంది.

**శ్రీలంక:** 2020 నవంబర్‌లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో మహేంద్ర రాజపక్ష నాయకత్వంలోని శ్రీలంక పీపుల్స్ ఫ్రీడమ్ అలయన్స్ బ్రహ్మాండమైన మెజారిటీతో విజయం సాధించినప్పటి నుండి దేశంలోని రాజకీయ వ్యవస్థలో రాజపక్ష సోదరులు ఆధిపత్యం చెలాయిస్తున్నారు. గొటయ రాజపక్ష ఆ దేశానికి అధ్యక్షుడుగా ఉన్నారు. నలుగురు రాజపక్ష సోదరులు ప్రభుత్వ పోస్టులు చేజిక్కించుకున్నారు. ప్రభుత్వం శ్రీలంక బుద్ధిస్టు జాతీయ వాదం మీద ఆధారాపడింది. ఇది తమిల, ముస్లిం మైనారిటీల పట్ల శత్రుపూరితంగా వ్యవహరిస్తున్నది.

దేశంలో జరిగిన అంతర్యుద్ధం సందర్భంగా జరిగిన యుద్ధ నేరాలపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలన్న నిర్ణయాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం నిరాకరిస్తున్నది. అంతే కాకుండా దేశంలోని ఉత్తర, తూర్పు రాష్ట్రాలకు అధికారాలు వికేంద్రీకరించేందుకు కూడా నిరాకరిస్తున్నది. శ్రీలంక రాజ్యాంగంలోని 13ఎ అధికరణం తూ.చా. తప్పకుండా అమలయ్యేట్లు భారత ప్రభుత్వం చూడాలి.

**మయన్మార్:** ఫిబ్రవరిలో మయన్మార్‌లో సైనిక కుట్ర జరిగిన తరువాత ఆంగ్ సాన్ సూక్యీ, ఆమె పార్టీ సహచరులను అరెస్టు చేయడానికి నిరసనగా వేలాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారు. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో సూక్యీ పార్టీ గెలుపొందింది. ఈ ఫలితాలను స్వీకరించడానికి సైన్యం అంగీకరించలేదు. సైన్యంలోని ఉన్నత స్థాయి వర్గాలు శక్తివంతమైన స్వార్థ, వ్యాపార సామ్రాజ్యాన్ని సృష్టించుకున్నారు. ఈ ఆర్థిక ప్రయోజనాల పరిరక్షణ కోసం వారు ప్రభుత్వం మీద పూర్తి ఆధిపత్యాన్ని కోరుకుంటున్నారు.

సైనిక కుట్రకు వ్యతిరేకంగా జరిగిన నిరసన ప్రదర్శనలపై తీవ్ర నిర్బంధం ప్రయోగిస్తున్నారు.

మయన్మార్‌లో ఏర్పడిన అశాంతి ప్రభావం భారత దేశంతో సహా దాని సరిహద్దు దేశాలన్నిటిపైనా పడింది. సామ్రాజ్యవాద దేశాలు మయన్మార్‌ను నియంత్రించడానికి ప్రయత్నిస్తున్నాయి. అనేక దేశాల గూఢచారి సంస్థలు ఆ దేశ ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకుని చురుకైన పాత్ర నిర్వహిస్తున్నాయి. మయన్మార్ సభ్యురాలిగా ఉన్న 'ఆసియాన్' దేశాల కూటమి పరిస్థితిని చక్కదిద్దేందుకు అయిదు సూత్రాల ఫార్ములా రూపొందించింది. మయన్మార్‌లో విదేశీ జోక్యం ఎలాంటిదైనా మన దేశ ప్రయోజనాలకూ, మొత్తం ఈ ప్రాంత ప్రయోజనాలకు నష్టదాయకమవుతుంది. తమ ప్రజా స్వామ్య హక్కుల కోసం,

ఎన్నికైన ప్రభుత్వం కోసం మయన్మార్ ప్రజలు చేస్తున్న పోరాటానికి మనం సంఘీభావం తెలపాలి.

**వాతావరణ మార్పులు: విధ్వంసకరమైన ప్రకృతి వైపరీత్యాలు**

**వాతావరణ మార్పులపై అంతర్జాతీయప్రభుత్వాల ప్యానల్ విడుదల చేసిన సరికొత్త నివేదిక:** భూతాపానికి సంబంధించి సరికొత్త ధోరణుల పట్ల 'వాతావరణ మార్పులు 2021: భౌతిక శాస్త్రా ఆధారం' అనే నివేదిక ఆందోళన గంటలు మోగించింది. హిందూ మహాసముద్రం శీఘ్రగతిన వేడెక్కుతున్నదనీ, దాని వల్ల సముద్ర మట్టాలు పెరుగుతున్నాయనీ ఫలితంగా కోస్తాలో తరచూ, తీవ్రమైన వరదలు సంభవిస్తున్నాయని అది తెలిపింది. భారత దేశ కోస్తా తీరంలోని 2.86 కోట్ల మంది ప్రజలు తీవ్రమైన వరదలు, తరచూ సంభవించే తుపానుల తాకిడికి గురవుతారు.

2021 జూన్–జులై మాసాల్లో ఉత్తరార్థ గోళంలో ముఖ్యంగా ఐరోపా, అమెరికా, కెనడాల్లో వాతావరణ మార్పులకు సంబంధించిన తీవ్రమైన ప్రకృతి వైపరీత్యాలు సంభవించాయి. భూమ్మీద బాగా అభివృద్ధి చెందిన కొన్ని దేశాల్లో జరిగిన తీవ్రమైన విధ్వంసం, ఆ విధ్వంసాన్ని ఎదుర్కోడానికి ఆయా దేశాలు సన్నద్ధంగా లేకపోవడం అక్కడి ప్రభుత్వాలకూ, ప్రజలకూ తీవ్రమైన షాక్‌లా తగిలింది. వాతావరణ మార్పులు వస్తే వర్థమానదేశాల్లోనే వస్తాయి మనకేం కాదనే ధీమాతో వీరు ఇప్పటి వరకు ఉన్నారు.

ఉత్తర యూరప్‌లో ముఖ్యంగా బ్రిటన్, జర్మనీ, బెల్జియం, హాలాండ్, ఇటలీల్లో కుంభవర్షాలు కురిశాయి. దాంతో ఆకస్మికంగా భారీ వరదలు సంభవించాయి. అనేక మంది చనిపోయారు. రోడ్లు, ఇళ్లు, ఇతర సదుపాయాలు కొట్టుకుపోయాయి. అధికారులు ఈ ఆకస్మిక పరిణామాలను ఊహించలేకపోయారు. అదే సమయంలో దక్షిణ ఐరోపాలో ముఖ్యంగా ఇటలీ, గ్రీస్, ఆల్బేనియా, మాజీ యుగోస్లావ్ రిపబ్లిక్కులు, ఆగ్నేయ టర్కీ, మధ్యదరా సముద్రం చుట్టూ, దానికి దగ్గరలో ఉన్న దేశాల్లో తీవ్రమైన ఒడగాడ్పులు వీచాయి. దాంతో దావానలాలు విపరీతంగా ఏర్పడ్డాయి. అమెరికా, కెనడాల్లో ఎన్నడూ లేని విధంగా సుధీర్ఘ కాలం వడగాడ్పు వీచింది. అధికారులు, ప్రజలు ముఖ్యంగా కెనడాలో ఈ పరిస్థితి వస్తుందని ఏమాత్రం ఊహించలేదు, అందువల్ల సన్నద్ధం కాలేదు.

ఈ వైపరీత్యాలు వేయి సంవత్సరాలకు ఒక సారి వచ్చేవని నిపుణులు చెబుతున్నారు. అయితే ఇటువంటి ఘటనలు తరచూ జరిగే అవకాశం

ఉందని చెబుతున్నారు. 1850తో పోలిస్తే నేటికి 1.2 డిగ్రీల సెల్షియస్ సగటు ఉష్ణోగ్రతలు పెరిగితేనే ఇటువంటి పరిస్థితులు ఏర్పడితే అంతర్జాతీయ శాస్త్రవిజ్ఞాన సంస్థలు చెబుతున్నట్లు 2 డిగ్రీల సెల్షియస్ ఉష్ణోగ్రతలు పెరిగితే పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

తదుపరి వాతావరణ శిఖరాగ్ర సభ 2021 డిసెంబర్‌లో గ్లాస్‌గోవ్‌లో జరగనుంది. పారిస్ ఒప్పందానికి మించి ఉద్గారాలను తగ్గిస్తామని ఆయా దేశాలు చేసిన వాగ్దానాలు ఎంతవరకు నెరవేరాయో ఈ శిఖరాగ్ర సభలో చర్చిస్తారు. అభివృద్ధి చెందిన దేశాలు ఉద్గారాలపై మరింత ఎక్కువ కోత విధించాల్సిన అవసరం ఉంది. వాస్తవానికి ఉద్గారాలను సున్నాకు తీసుకువస్తామన్న లక్ష్యాలను (అంటే అడవులు, సముద్రాలు, ఇతరాలు పీల్చుకునే స్థాయికి కర్బన ఉద్గారాలను తగ్గించుకునే లక్ష్యాలను) 2050 నాటికి చేరుతామని వాగ్దానం చేశారు. కానీ ఆ లక్ష్యాలను ముందుగానే చేరాల్సిన అవసరం ఉంది. అభివృద్ధి చెందిన దేశాలు ఎటువంటి షరతులు లేకుండా గ్రీన్ సాంకేతికతలను వర్ధమాన దేశాలకు బదిలీ చేయాలి. వాతావరణ మార్పుల ప్రభావాలను తట్టుకునే మిటిగేషన్, అడాప్టేషన్ చర్యలకోసం వర్ధమాన దేశాలకు భారీగా నిధులు అందించాలి.

**భారత దేశం:** గత దశాబ్దం పైగా భారత దేశంలో కూడా వర్షాల విషయంలో తీవ్రమైన వైపరీత్యాలు సంభవిస్తున్నాయి. రోజుకు 200 నుండి 300 మిమి వర్షపాతం వరకు తరచుగా, భారీగా కురుస్తున్నది. దానివల్ల భారీ వరదలు వచ్చి తీవ్రమైన నష్టం జరుగుతోంది. దేశంలోని విభిన్న ప్రాంతాల్లో పట్టణాల్లో నీరు నిలిచిపోవడం, కొండచరియలు విరిగిపడ్డం జరుగుతోంది. కోస్తా తీరం నిరంతరం కోతకు గురవుతోంది. సముద్ర మట్టం పెరుగుతుండడంతో సుందర్‌బన్ అడవులు ముంపుకు గురవుతున్నాయి. ఇది ప్రధానమైన కోస్తా నగరాలకు ప్రమాదంగా మారింది. ఈ సమస్యల్లో దేన్నీ పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదు. దశలవారీగా అమలు చేసే లక్ష్యాన్ని రూపొందించుకుని దేశవ్యాపితమైన కార్యక్రమాన్ని తక్షణం చేపట్టాల్సిన అవసరం ఉంది. ఇటువంటి చర్యలు తీసుకోకుండా ఎంతకాలం ఆలస్యం చేస్తే ఈ కార్యక్రమం ఖరీదు అంతగా పెరిగిపోతుంది. పైగా మౌలిక సదుపాయాలకు, ప్రజల ప్రాణాలకు, జీవనానికీ అంతగా నష్టం జరుగుతుంది.

# జాతీయం

## కోవిడ్ మహమ్మారి–వ్యాక్సిన్ కొరత

కోవిడ్ రోజువారీ కేసులు మళ్లీ పెరుగుతున్నాయి. జులై 20తో అంతమయ్యే వారంలో రోజువారీ సగటు ఇన్‌ఫెక్షన్లు 37,975 ఉండగా ఆగస్టు 3తో అంతమయ్యే వారంలో 40,710 ఉన్నాయి. ప్రస్తుతం దేశంలో 42 లక్షల కోవిడ్ కేసులున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం మొత్తం 4.245 లక్షల మంది చనిపోయారు. ఇది చాలా తక్కువ చేసి చెప్పిన లెక్క అని అంతర్జాతీయంగా, దేశీయంగా అనేక అంచనాలు తెలియజేస్తున్నాయి. భారత దేశంలో కోవిడ్‌మరణాలు 34 నుండి 49 లక్షల వరకు ఉంటాయని వాషింగ్టన్ నుండి పనిచేసే సెంటర్ ఫర్ గ్లోబల్ డెవెలప్‌మెంటు తెలిపింది. గత ఏడాదితో పోలిస్తే 'అదనంగా రికార్డయిన మరణాలు' అన్నీ కరోనా వల్ల సంభవించినవేననీ, వాటిని ఇతర జబ్బుల కింద చూపించారనీ దేశీయంగా జరిగిన అనే అధ్యయనాలు తెలిపాయి.

భయంకరమైన మూడో వెల్లువ రాకుండా ఆపాలంటే వ్యాక్సిన్‌లు వేసే వేగాన్ని గణనీయంగా పెంచాలి. ప్రస్తుతం మన వయోజనుల్లో 11.3 శాతం మంది మాత్రమే రెండు డోసులు వేసుకోగలిగారు, ఈ 11.3 శాతంతో సహా మొత్తం 40 శాతం మంది ఒక్క డోస్ పొందారు. ఇదే వేగంతో వ్యాక్సినేషన్ సాగితే ఈ ఏడాది చివరికి వయోజనులందరికీ వ్యాక్సిన్ వేయాలన్న లక్ష్యం పూర్తి చేయడం అసాధ్యం అవుతుంది.

ఇలా వ్యాక్సిన్‌లు నెమ్మదిగా వేయడానికి ప్రధాన కారణం వ్యాక్సిన్‌ల కొరతే. వ్యాక్సిన్‌లు తక్కువగా సరఫరా చేస్తున్నారని ప్రతి రాష్ట్రం ఫిర్యాదు చేస్తున్నది. జులై 31 నాటికి 51.6 కోట్ల డోస్‌ల వ్యాక్సిన్ అందుబాటులో ఉంటుందని కేంద్ర ప్రభుత్వం జూన్ 26న సుప్రీం కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నది. అయితే ఆగస్టు 2 నాటికి కూడా వారు 49.7 కోట్ల డోస్‌లు మాత్రమే ఇవ్వగలిగారు. 2 కోట్ల డోస్‌లు తక్కువగా సరఫరా చేశారు. యుద్ధ ప్రాతిపదిక మీద వ్యాక్సిన్ ఉత్పత్తి చేయాల్సి ఉంది. ఇది జరగాలంటే ప్రభుత్వం కోవాక్సిన్ కోసం అభివృద్ధి చేసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇతర ప్రభుత్వ రంగ సంస్థలకు, ప్రయివేటు కంపెనీలకు బదిలీ చేసి ఉత్పత్తి పెంచాలి. వాటికి తగిన ఆర్థిక సాయం చేయాలి. దీనికి తోడు ప్రపంచ వ్యాపితంగా అవకాశం ఉన్న అన్ని చోట్ల నుండి వ్యాక్సిన్‌లు సేకరించాలి.

**కేరళ:** భారత దేశంలో కరోనా పోజిటివ్ కేసులు పెరగడానికి కేరళ కారణమని నిందిస్తూ బిజెపి కేంద్ర ప్రభుత్వం దుష్ప్రచారం ప్రారంభించింది. కేరళ ప్రభుత్వం నిజాయితీగా చూపించిన సంఖ్యలను ఉదాహరణలుగా చూపిస్తోంది. కేరళలో కరోనా టెస్టులు అత్యధికంగా ఉండడం వల్లనే అక్కడ కరోనా కేసుల రేటు ఎక్కువగా కనిపిస్తున్నది. ఒక్కో రోజు ఆ రాష్ట్రం రెండు లక్షల పరీక్షలు నిర్వహిస్తున్నది. దేశ వ్యాపితంగా 33 కేసుల్లో సగటున ఒక కేసు కనుగొనబడుతుంటే కేరళలో ఆరుకు ఒక కేసు కనుగొనబడుతోంది. సీరో-ప్రెవైలెన్స్ (సీరాలజీ స్పెసిమెన్స్ ఆధారంగా జనాభాలో పాజిటివ్‌గా తేలిన వారి సంఖ్య) భారత దేశంలో 68 శాతం ఉండగా కేరళలో చాలా తక్కువగా 44 శాతం మాత్రమే ఉంది. దీన్ని బట్టి కేరళ కరోనా వ్యాప్తిని మరింత మెరుగ్గా అరికట్టగలిగిందని తెలుస్తోంది. దేశ వ్యాపితంగా వయోజనుల్లో 11 శాతం మందికి పూర్తిగా రెండు డోస్‌లు వ్యాక్సిన్ వేయగా కేరళలో 23 శాతం మందికి రెండు డోస్‌లు వేశారు. దేశ వ్యాపితంగా సగటున మరణాల రేటు 1.3 శాతం ఉండగా కేరళలో దానిలో మూడో వంతు అంటే 0.5 శాతం ఉంది. కేరళ ఆసుపత్రుల్లో 57 శాతం పడకలు, 40 శాతం ఐసియులు నిండాయి. అంటే దాని ప్రజారోగ్య వ్యవస్థ దేశంలోని ఇతర ప్రాంతాల కంటే మెరుగ్గా ఉందని తెలుసోంది.

## పార్టీ సహాయ కార్యక్రమాలు

కరోనా మహమ్మారి, లాక్‌డౌన్‌ల వల్ల బాధలు పడుతున్న ప్రజలకు సహాయం అందించడంలో మన పార్టీ శాఖలు దేశవ్యాపితంగా చాలా చురుకుగా పనిచేశాయి. ఆంధ్ర ప్రదేశ్‌లో మన రాష్ట్ర కమిటీ కరోనా సోకినవారికోసం ఐసొలేషన్ కేంద్రాలు నెలకొల్పింది. బెంగాల్‌లో మన రెడ్ వాలంటీరు దళం పెద్ద ఎత్తున సహాయ కార్యక్రమాలు చేపట్టింది. అదే విధంగా అనేక రాష్ట్రాల్లో ప్రజలకు ఉచిత ఆహార కిట్లు, ఇతర సహాయం అందించారు.

## భారత దేశ ఆర్థిక వ్యవస్థ

భారత దేశ ఆర్థిక వ్యవస్థ గతంలో ఎన్నడూ చూడని మాంద్యాన్ని చవిచూస్తోంది. 2021-22లో భారత దేశ జిడిపి వృద్ధి అంచనాలను ఐఎంఎఫ్ 12.5 శాతం నుండి 9.5 శాతానికి తగ్గించింది. ప్రతి కీలక రంగమూ నేల చూపులు చూస్తోంది. 2019-20లో భారత దేశ జిడిపి రూ. 146 లక్షల కోట్లు

కాగా 2021లో అది రూ. 135 కోట్లకు పడిపోయింది.

ఈ మాంద్యాన్ని నివారించాలంటే ప్రభుత్వం పెద్ద ఎత్తున ఖర్చు చేయాలి. దాని వల్ల ప్రజలకు ఉపాధి, కొనుగోలు శక్తి పెరుగుతుంది. ప్రజల చేతుల్లో ఖర్చులకు డబ్బులు మెదులుతాయి. ఈ పని జరగాలంటే దేశానికి కావలసిన మౌలిక సదుపాయాలకోసం, ఉద్యోగాలు కల్పించడం కోసం, దేశీయ గిరాకీ పెంచడం కోసం పెద్ద ఎత్తున ప్రభుత్వ పెట్టుబడులు పెంచాలి. దేశంలో మాంద్యం ఏర్పడ్డానికి ఈ అంశాలే కారణం. కానీ ప్రభుత్వం ఇప్పటి వరకు ప్రకటించిన ఉద్దీపన ప్యాకేజీలన్నీ వ్యాపారులకు రుణాలు అందించే సదుపాయాలు కల్పించడానికి ఉద్దేశింపబడ్డవి మాత్రమే. అయితే ఆర్థిక వ్యవస్థ మాంద్యంలో ఉన్నప్పుడు ఏ వ్యాపారి కూడా రుణాలు తీసుకోడానికి ఇష్టపడడు. నేరుగా నగదు ఇవ్వడం, ఉచిత ఆహార పంపిణీ ద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెంచడం సాధ్యపడుతుంది. కేంద్ర ప్రభుత్వం ఈ పని చేయ నిరాకరిస్తున్నది. దీని వల్ల ప్రజల ఆర్థిక బాధలు పెరుగుతున్నాయి, నిరుద్యోగం, ఆకలి అధికమవుతున్నాయి.

ఉద్దీపన ప్యాకేజీలు పేదలకు వ్యతిరేకంగా, ధనికులకు అనుకూలంగా ఉన్నాయి. రాష్ట్రాల పట్ల వివక్షతతో కూడి ఉన్నాయి. ఈ ప్యాకేజీల వల్ల కార్పొరేట్ పన్నుల ఆదాయం 2019-20లో రూ. 5.5 లక్షల కోట్ల నుండి 2020-21లో రూ. 4.5 లక్షల కోట్లకు పడిపోయింది. అయితే ఈ కాలంలో కేంద్ర ప్రభుత్వ పన్ను ఆదాయం దాదాపు 1 లక్షల కోట్లు పెరిగింది. ఇదంతా పెట్రోలియం ఉత్పత్తుల మీద ఎక్సయిజ్ పన్నులు పెంచడం ద్వారా, రాష్ట్రాలకు ఇవ్వాల్సిన పన్ను ఆదాయం వాటా రూ. 6.5 లక్షల కోట్ల నుండి రూ. 5.9 లక్షల కోట్లకు తగ్గించడం ద్వారా జరిగింది. కరోనా మహమ్మారిని ఎదుర్కొంటున్న రాష్ట్రాలకు ఆర్థికంగా మద్దతివ్వాల్సిన ఈ సమయంలో కేంద్ర ప్రభుత్వ పన్నుల ఆదాయం పెరుగుతూ, రాష్ట్రాల వాటా తగ్గిపోయింది.

**జాతీయ వనరుల లూటీ:** గత కేంద్ర కమిటీ సమావేశంలో చెప్పినట్లుగానే ఈ కాలంలో కూడా ప్రభుత్వ రంగ ఆస్తుల ప్రయివేటీకరణ పెద్ద ఎత్తున సాగిపోతోంది. పార్లమెంటులో ఒకవైపు పాలక పార్టీ గందరగోళం సృష్టిస్తూ మరోవైపు గందరగోళం మధ్య ప్రయివేటీకరణ శరవేగంగా సాగించారు. ప్రయివేటీకరణను చట్టబద్ద చేసేందుకు చట్టాలు చేశారు. సరికొత్తగా బీమా రంగాన్ని ప్రయివేటీకరించారు. దీని వల్ల దేశ ఆర్థిక వ్యవస్థమీద విధ్వంసకరమైన ప్రభావం ఉంటుంది. ద్రవ్య రంగంలోనూ, మౌలిక సదుపాయాల అభివృద్ధికీ అతి పెద్ద

పెట్టుబడి పెట్టేది బీమా రంగం. ఇంతపెద్ద మొత్తాల డబ్బు స్వదేశీ, విదేశీ ప్రయివేటు కార్పొరేట్లకు అప్పగించడం వల్ల భారత దేశాభివృద్ధికి కావలసిన వనరులు లేకుండా పోతాయి.

## శ్రామిక ప్రజల హక్కులపై మరిన్ని దాడులు

కార్మిక వర్గం తరతరాల పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను కాలరాసేందుకు కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టడమే కాకుండా వారి హక్కులపై కొత్త దాడులకు ప్రభుత్వం పాల్పడుతోంది. పార్లమెంటులో సృష్టించబడిన గందరగోళం మధ్య రక్షణ సర్వీసుల్లో సమ్మెలు నిషేధించే బిల్లును ఆమోదించింది. రానున్న కాలంలో అటువంటి నిరంకుశ చట్టాలు మరిన్ని రానున్నాయి.

బీమా రంగంతోపాటు లాభాలు ఆర్జిస్తున్న నవరత్నాలు, విశాఖ ఉక్కు కర్మాగారంతో సహా ప్రభుత్వ రంగ బ్యాంకులను కూడా ప్రయివేటీకరిస్తున్నారు. అదే సమయంలో దేశంలోని భారతీయ రైల్వేలు, రవాణా సదుపాయాలను కూడా ప్రయివేటీకరించడం జరిగిపోతున్నది.

మన ఖనిజ సంపద వంటి జాతీయ వనరుల లూటీ యథేచ్ఛగా సాగిపోతున్నది.

## ప్రజలపై ప్రభావం

**అసాధారణంగా పెరుగుతున్న పేదరికం:** భారతదేశంలో పేదరికం ప్రమాదకరంగా పెరుగుతోంది. వివిధ గణాంకాలు ఈ విషయాన్నే చెబుతున్నాయి. ప్రణాళిక సంఘాన్ని రద్దు చేయడంతో పాటు, మోడీ ప్రభుత్వం అంతకుముందునుండి పేదరికపు లెక్కలకు ప్రాతిపదికగా ఉన్న పోషకాహార ప్రమాణాలను కూడా విడిచిపెట్టేసింది. గ్రామీణ ప్రాంతాల్లో ఒక వ్యక్తికి రోజుకు 2,200 కేలరీలు, పట్టణ ప్రాంతాల్లో 2,100 కేలరీలను కనీస పోషకాహార స్థాయిగా గతంలో నిర్ణయించారు. దీనిని ఆధారంగా చేసుకుని 1993-94లో ఎన్ఎస్ఎస్ నిర్వహించిన విస్తృత స్థాయి సర్వే ప్రకారం 1993-94 నాటికి గ్రామీణ ప్రాంతాల్లో 58శాతం మంది, పట్టణ ప్రాంతాల్లో 57 శాతం మంది దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారు. ఇదే తరహాలో 2011-12లో చేసిన సర్వేలో ఈ శాతాల లెక్క గ్రామీణ ప్రాంతాల్లో 68, పట్టణ ప్రాంతాల్లో 65గా ఉంది.

2017–18లో ఎన్ఎస్ఎస్ మళ్లీ విస్తృత స్థాయిలో సర్వే నిర్వహించింది. అయితే, ఈ సర్వేలోని వాస్తవ నిర్ధారణలను వెలుగులోకి రాకుండా మోడీ ప్రభుత్వం అడ్డుకుంది. మీడియాకు లీకైన సమాచారం ప్రకారం తలసరి వాస్తవ వినియోగ వ్యయం (కేవలం ఆహారం మీద చేసేది కాదు) 9శాతం తగ్గినట్టు తేలింది. ప్రజలు చేసే ఖర్చు ఈ స్థాయిలో తగ్గడం అనూహ్యం. దీనిని బట్టే గతంలో ఎన్నడూ లేనివిధంగా అసాధారణ రీతిలో పేదరికం పెరిగినట్టు స్పష్టంగా అర్ధమౌతోంది. దేశంలో కరోనా వ్యాప్తి ప్రారంభానికి ముందే గ్రామీణ ప్రాంతాలతోపాటు, పట్టణ ప్రాంతాల్లో కూడా పేదరికం అసాధారణంగా పెరిగింది.

కరోనా వ్యాప్తి తరువాత పరిస్థితి మరింత దారుణంగా మారింది. వైరస్ వ్యాప్తిని నివారించడానికి అమలుచేసిన లాక్‌డౌన్‌లతో అప్పటికే అంతంతమాత్రంగా ఉన్న ప్రజల ఆర్థిక పరిస్థితి మరింతగా క్షీణించింది. అప్పులు పెరిగిపోయాయి. అనేక కుటుంబాలు నగలు, ఆస్తులను అమ్ముకుని జీవనం కొనసాగించాల్సిన దుస్థితి ఏర్పడింది. జిడిపిలో 60 శాతానికి దోహదం చేసే గృహ వినియోగదారుల ఖర్చులు అసాధారణంగా తగ్గాయి. ఇది ప్రజలను మరింతకష్టాల్లోకి, ఆర్థిక మాంద్యలోకి నెట్టివేసింది.

నేడు ప్రపంచ ఆకలి సూచీ (హంగర్ ఇండెక్స్)లో మన దేశం ఆందోళన చెందాల్సిన విభాగంలో నిలిచింది. ఎన్ఎఫ్‌హెచ్ఎస్–5 ప్రకారం పోషకాహార లోపం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ముఖ్యంగా చిన్న పిల్లల్లో ఇది మరింత తీవ్రంగా కనిపిస్తోంది. శిశుమరణాలతో పాటు మరో రెండు అంశాల్లో నిర్ధేశించిన లక్ష్యాలను చేరుకోకపోవడంతో సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధన గ్లోబెల్ ఇండెక్స్‌లో రెండు గ్రేడ్‌లు తగ్గాయి. ఏడాది క్రితం ప్యూ రిసెర్చి సెంటర్ రూపొందించిన అంచనాల ప్రకారం పేదరికపు రేఖకు దిగువన ఉన్న భారతీయుల సంఖ్య 6 కోట్ల నుండి13.4 కోట్లకు పెరిగింది. దీంతో గత ఏడాది ప్రపంచ పేదరికం 57.3శాతానికి చేరింది. మన దేశ మధ్య తరగతి ప్రజల్లోని 59.3 శాతం మంది పేదరికపు కోరల్లో చిక్కారు.

**పెరుగుతున్న నిరుద్యోగం:** లాక్‌డౌన్ ప్రారంభమైన తరువాత నిరుద్యోగ రేటు 24శాతానికి పెరిగింది. అదే సమయంలో కార్మిక భాగస్వామ్యపు రేటు గణనీయంగా 40 శాతానికి పడిపోయింది. ప్రతి నెలా జీతాలు పొందే వారు 2.10 కోట్ల మంది తమ ఉద్యోగాలను కోల్పోయారు. ఇది అంతకుముందుఉన్న మొత్తం ఉద్యోగుల్లో 25 శాతం. ఇది కాకుండా ఎంఎస్ఎంఇ విభాగం దారుణంగా

దెబ్బతినడంతో 25 శాతం మంది పారిశ్రామిక కార్మికులు తమ ఉపాధిని కోల్పోయారు. వీరి సంఖ్య సుమారుగా 1.5 కోట్లు ఉంటుందని అంచనా. ఇంకా వివిధ అంచనాలు ఉన్నప్పటికీ, దేశంలో గరిష్ట ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సృష్టించే వివిధ రంగాలు దెబ్బతిన్న తీరును బట్టే ఈ పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. నిర్మాణ రంగంలో 50 శాతం, వ్యాపారం, హోటల్స్, ఇతర సేవా రంగాల్లో 47 శాతం, ఉత్పత్తి రంగంలో 13శాతం, గనులలో 23శాతం మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కోల్పోయారు.

ఇలా ఉపాధి కోల్పోయిన వారిలో అనేకమంది, ముఖ్యంగా వలసకార్మికులు ఉపాధిహామీ చట్టం (ఎంజిఎన్ఆర్ఎ)పై ఆధారపడటం ప్రారంభించారు. దీనిని దృష్టిలో ఉంచుకున్నప్పుడు ఎంజిఎన్ఆర్ఎ అమలుకు నిధులు పెరుగుతాయని ఆశించడం సహజం. కానీ, జరిగింది వేరు. జాతీయ స్థాయిలో ఉపాధి హామీ నిధులకు కోత పెట్టారు. 2020-21 సవరించిన బడ్జెట్‌తో పోలిస్తే తాజా బడ్జెట్‌లో 34శాతం మేర నిధులకు కోత పెట్టారు. మరోవైపు ఉపాధి హామీ పనులకు డిమాండ్ పెరుగుతోంది. (గతంలో ఎన్నడూ లేని విధంగా 2020-21లో 72 లక్షల మంది వందరోజుల పని పూర్తి చేశారు.) మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పనిదినాలను, కూలీని పెంచడానికి తిరస్కరిస్తోంది.

**అధిక ద్రవ్యోల్బణం:** నిత్యావసర వస్తువుల ధరలు అనూహ్యంగా పెరగడం అధిక ద్రవ్యోల్బణానికి దారి తీసింది. ఫలితంగా ప్రజల కష్టాలు రెట్టింపైనాయి. మరోవైపు పెట్రోలియం ఉత్పత్తులపై సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీలను కేంద్రం భారీగా పెంచింది. 2021 జనవరి ఒకటి నుండి జులై 22 వరకు పెట్రోలు ధరలను 67 సార్లు, డీజల్ ధరలను 63 సార్లు సవరించారు. గ్యాస్ సిలిండర్ల ధరలు కూడా పైపైకే వెళ్లాయి. 2020 మే నుండి గ్యాస్ సిలిండర్లపై సబ్సిడీ లేకుండా చేశారు. గత ఏడు నెలల కాలంలో సిలిండర్ ధర సుమారుగా 250 రూపాయలు పెరిగింది . ఢిల్లీలో గ్యాస్ సిలిండర్ ధర ప్రస్తుతం 834 రూపాయలు.

అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా తగ్గినప్పుడు ఈ పెరుగుదల చోటుచేసుకోవడం గమనార్హం. 2019-20లో భారతదేశానికి బ్యారెల్ క్రూడ్ ఆయిల్ అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే 30 శాతం తక్కువ ధరకే సరఫరాఅయ్యేది. 2004-05 సంవత్సరం నుండి ఇదే అతి తక్కువ ధర. ఇక 2014లో 880 డాలర్లగా ఉన్న ఎల్‌పిజి ధర విషయానికొస్తే 2021 నాటికి

382 డాలర్లకు పడిపోయింది.

ఈ ధరల తగ్గింపు ప్రయోజనాలను ప్రజలకు అందించడానికి బదులుగా ప్రభుత్వం తన ఆదాయాలను పెంచుకోవడానికే ప్రాధాన్యత ఇచ్చింది. 2020-21లో 3.4లక్షల కోట్ల రూపాయలను ఎక్సైజ్ డ్యూటీ రూపంలోనూ, పెట్రో సెస్ రూపంలో 1.54 లక్షల కోట్లను గత ఏడాదికన్నా అధికంగా వసూలు చేసింది.

**పెరుగుతున్న అంతరాలు:** దేశంలో అంతరాలు భారీగా పెరుగుతున్నాయి. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం కరోనా ప్రబలిన ఏడాదిలో దేశంలో బిలియనీర్ల సంఖ్య 102 నుండి 140కి పెరిగింది. వారి ఉమ్మడి సంపద 44లక్షల23వేల కోట్ల రూపాయలకు (596 బిలియన్ డాలర్లు) పెరిగింది. అత్యధిక సంఖ్యలో బిలియనీర్లు ఉన్న దేశాల్లో భారతదేశం ప్రస్తుతం 3వ స్థానంలో ఉంది.

**మహిళలు, దళితులు, ఆదివాసీలపై పెరుగుతున్న దాడులు:** మహిళలపై లైంగిక నేరాలు, గృహహింస, వేధింపులు పెరుగుతూనే ఉన్నాయి. దళిత మహిళలు, మైనర్లపై అత్యాచారాలు, అమానుష హత్యాకాండలు మరింత భయంకరంగా జరుగుతున్నాయి. దళితులపై సామాజిక అన్యాయాలు, నేరాలు పెరుగుతూనే ఉన్నాయి. సఫాయి పని ( మాన్యువల్ స్కావెంజింగ్) కారణంగా గత ఐదు సంవత్సరాల్లో ఎటువంటి మరణాలు సంభవించలేదని ప్రభుత్వం పార్లమెంటుకు తెలిపింది. అయితే, ఇదే ప్రభుత్వం ఫిబ్రవరిలో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో ఈ నిషేధ వృత్తి కారణంగా గత ఐదు సంవత్సరాల్లో 340 మంది సఫాయి కార్మికులు చనిపోయారని తెలిపింది. దీంతో మొదట చెప్పింది అసత్యమని తేలిపోయింది. దళిత హక్కుల సంఘాలు ఇచ్చిన లెక్కల మేరకు ఈ తరహా మృతుల సంఖ్య 472. గిరిజనుల హక్కులు దారుణంగా ఉల్లంఘనకు గురి అవుతున్నాయి. అటవీహక్కుల చట్టం అమలు నామమాత్రంగా మారింది. మైనింగ్ ప్రైవేటీకరణతో విచ్చలవిడిగా జరుగుతున్న తవ్వకాలు, అడవుల నరికివేత కారణంగా వారు తమ సాంప్రదాయ అవాసాలను బలవంతంగా ఖాళీ చేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

**ఫెడరలిజంపై పెరుగుతున్న దాడులు:** ఫెడరలిజంపైనా, రాష్ట్రాల హక్కుల మీద తీవ్ర స్థాయిలో దాడులు జరుగుతున్నాయి. రాజకీయ, ఆర్థిక, సామాజిక,సాంస్కృతిక తదితర అన్ని రంగాల్లోనూ ఈ దాడులు కొనసాగుతున్నాయి. గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లు రాజ్యాంగాన్ని అతిక్రమించి వ్యవహరిస్తున్నారు.

మహారాష్ట్ర గవర్నర్‌యైనా, పశ్చిమబెంగాల్ గవర్నరైనా మరే రాష్ట్రానికి చెందిన గవర్నరైనా కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఏజెంట్లుగా బహిరంగంగానే వ్యవహరిస్తున్నారు. లక్షద్వీప్ పాలనాధికారి స్థానిక ప్రజల హక్కులను కాలరాస్తున్నాడు. గుజరాత్‌కు చెందిన ఈ బిజెపి నాయకుడు బడి పిల్లల మధ్యాహ్న భోజనం నుండి భూమి హక్కుల వరకు అన్ని అంశాలపై బ్రిటిష్ పాలన నాటి వైస్రాయ్‌లాగా పెత్తనం చెలాయించాలని చూస్తున్నాడు.

రాష్ట్రాల ఆర్థిక హక్కులు నిరంతరం అణచివేతకు గురవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు జిఎస్‌టి బకాయిలను చెల్లించడం లేదు. రాష్ట్రాల రుణ పరిమితి పెంచడానికీ అనేక షరతులు పెడుతున్నారు. పన్నుల్లో రాష్ట్రాల వాటా తగ్గింపే లక్ష్యంగా అనేక రకాల సెస్సులు, స్పెషల్ డ్యూటీలు విధిస్తున్నారు. రాష్ట్రాలకు జిఎస్‌టి పరిహార చెల్లింపును మరో 5 సంవత్సరాల పాటు తప్పనిసరిగా పెంచాలి.

విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి తదితర అంశాల్లో కేంద్రం రాష్ట్రాల హక్కులను అతిక్రమించింది. మూడు వ్యవసాయ చట్టాలు, నూతన విద్యావిధానం, వివిధ కేంద్ర ప్రాయోజిత పథకాలు దీనికి ఉదాహరణలు. కేంద్ర ప్రభుత్వంలో సహకారశాఖకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయడం కూడా అతి పెద్ద హక్కుల అతిక్రమణ. సహకారమన్నది పూర్తిగా రాష్ట్రాల పరిధిలోని అంశం.

ఫెడరల్ హక్కులపై జరుగుతున్న ఈ తరహా దాడులను అరికట్టడానికి బిజెపియేతర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రావాల్సిఉంది. రాష్ట్రాల హక్కులు, ఫెడరల్ సూత్రాల పరిరక్షణ నిరంకుశ, కేంద్రీకరణ విధానాలపై జరిగే పోరాటంలో భాగం.

**పార్లమెంటరీ వ్యవస్థలపై దాడి:** పెగాసస్ స్పైవేర్ గురించి చర్చించడానికి మోడీ ప్రభుత్వం నిరాకరించడంతో తీవ్ర అంతరాయం కలిగింది. దీనితో పాటు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగం చేస్తున్న పోరాటం, ప్రజల జీవనోపాధిమీద, పౌరహక్కుల మీద జరుగుతున్న దాడులు, నిరుద్యోగం, ధరల పెరుగుదల తదితర అంశాలు కూడా పార్లమెంటులో చర్చకు రానీయలేదు.

భారత రాజ్యాంగం నిర్దేశించిన ప్రమాణాల మేరకు పార్లమెంటుకు బాధ్యతగా వ్యవహరించడానికి, దేశ ప్రజలకు వాస్తవాలు చెప్పడానికి మోడీ ప్రభుత్వం సిద్ధంగా లేదన్నది స్పష్టం. ప్రజల సార్వభౌమాధికారం...(భారత

ప్రజలమైన మేము)ను అమలు చేయడంలో పార్లమెంటు కీలకమైన అనుసంధానపాత్ర పోషించాలి. ప్రభుత్వం పార్లమెంటుకు బాధ్యత వహించాలి. ఎంపీలు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. పార్లమెంటు సజావుగా నడవకపోతే ఈ లింకు తెగిపోతుంది. ప్రజల సార్వభౌమాధికారానికి భంగం కలుగుతుంది. ఇది రాజ్యాంగ స్ఫూర్తిని, రాజ్యాంగం నిర్దేశించిన క్రమాన్ని ధ్వంసం చేయడమే.

ఇతర స్వతంత్ర రాజ్యాంగ వ్యవస్థలు న్యాయవ్యవస్థ, ఎన్నికల కమిషన్ వంటి వాటిని ప్రభుత్వ చెపుచేతుల్లో ఉంచుకునేందుకు తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారు. సిబిఐ, ఇడి వంటి సంస్థలు ఇప్పటికే అధికారపార్టీ ఏజెంట్లుగా మారిపోయాయి.

**ప్రజాతంత్ర, పౌర హక్కులపై దాడులు:** యుఎపిఎ, సెడిషన్, ఎన్ఎస్ఎల కింద వందలాది మంది ప్రజానీకం తీవ్ర నిర్బంధానికి గురవుతున్నారు. ఛార్జిషీటు కూడా నమోదు చేయకుండా ఈ నిర్బంధం కొనసాగుతోంది. బీమా కొరెగావ్ కేసులో నిందితులు రెండు సంవత్సరాలుగా జైలులోనే ఉన్నారు. ఇటీవల మృతి చెందిన 84 సంవత్సరాల ఫ్రీస్టు స్టాన్‌స్వామికి కనీస వైద్య సదుపాయాలు కూడా కల్పించకుండా కేంద్రం ఎంత అమానవీయంగా ప్రవర్తించిందో యావద్దేశం చూసింది. న్యాయవ్యవస్థ జోక్యంచేసుకుని ఆస్పత్రికి తరలించాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ, మరణాన్ని నివారించలేనంత ఆలస్యం అప్పటికే జరిగింది. ఈ తరహా తప్పుడు కేసులు పెట్టడానికి, క్రూరమైన నిర్బంధాన్ని అమలు చేయడానికి, అమానవీయ ధోరణులకు కారణమైన వారు జవాబుదారీ తనం నుండి తప్పించుకోకూడదు. రాజకీయ ప్రేరిపిత అంశాల కారణంగా నిర్బంధానికి గురై జైళ్లలో ఉన్నవారినందరినీ తక్షణమే విడుదల చేయాలి.

సిఎఎ. ఎన్‌పిఆర్, ఎన్ఆర్‌సిలకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల్లో పాల్గని నిర్బంధానికి గురైన వారిలో కొందరు యువకులు న్యాయపరమైన జోక్యంతో విడుదలయ్యారు. కానీ ఇంకా ఎందరో ఎలాంటి కేసులు లేకుండా నిర్బంధానికి గురై ఉన్నారు. సత్యాలను రిపోర్టు చేసినందుకు చాలా మంది పాత్రికేయులు కూడా నిర్బంధంలో ఉన్నారు. జెఎన్‌యు క్యాంపస్‌లో గత ఏడాది చోటుచేసుకున్న సంఘటనలకు సంబంధించి స్పష్టమైన వీడియో కవరేజి ఉన్నప్పటికీ బయట వ్యక్తుల నెవరినీ ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేయలేదు. ఈ మేరకు పార్లమెంటుకు సమాచారమిచ్చారు. కేంద్రం, రాష్ట్రాలలో బిజెపి అధికారంలో ఉన్న చోట్ల తమ రాజకీయ అజెండాను రుద్దడానికి పోలీసులను వినియోగించుకుంటున్నారు.

**మతసమీకరణలకు పదును:** మైనార్టీలకు వ్యతిరేకంగా ప్రజానీకాన్ని రెచ్చగొట్టడమే లక్ష్యంగా బిజెపి రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కొత్త చట్టాలను రూపొందిస్తున్నాయి. వీటి లక్ష్యం మత ప్రాతిపదికన హిందుత్వ ఓటు బ్యాంకును స్థిరీకరించుకోవడం. అధికారంలో కొనసాగడం. జనాభా నియంత్రణ, పశువల తరలింపు చట్టాలు ఇటువంటివే.

గ్యానవాపీ మసీదు ఉన్న స్థలంలో గతంలో దేవాలయం ఉందో లేదో నిర్ధారించడానికి దిగువ కోర్టు ఒక కమిటీని ఏర్పాటు చేసింది. నిజానికి ఇది ప్రార్ధనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టానికి విరుద్దం. దేశంలో ఉన్న అన్ని ప్రార్ధనా స్థలాల్లో యధాతధ స్థితిని కొనసాగించాలని ఈ చట్టం నిర్దేశిస్తుంది. అయితే, కోర్టు ఇచ్చిన ఆదేశాలను మెజార్టీ ప్రజానీకాన్ని రెచ్చగొట్టడానికి హిందుత్వ శక్తులు ఉపయోగించుకున్నాయి. ఇటువంటి సమయంలో దిగువ కోర్టు ఆదేశాలను రద్దు చేయడానికి ఉన్నతన్యాయస్థానం వెంటనే జోక్యం చేసుకోవాలి.

**జమ్మూ కాశ్మీర్ - దిగజారుతున్న పరిస్థితి:** కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370, 35-ఎతోపాటు జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాన్ని రద్దు చేసి రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా పునర్వ్యవస్థీకరించి రెండేళ్లు గడిచాయి. ఈ రద్దు రాజ్యాంగ ఉల్లంఘనేనంటూ సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ సుప్రీం కోర్టు ముందు పెండింగులో ఉండటం దురదృష్టకరం. ఈ చర్యలు భారత ప్రభుత్వంతో జమ్మూ కాశ్మీర్ ప్రజలకు మధ్య సంబంధాలను దెబ్బ తీస్తున్నా... వాటిని ఆమోదించడం మినహా మరో గత్యంతరం లేని స్థితిని ఇది కల్పిస్తున్నది.

ఆర్టికల్ 35-ఎను రద్దు చేయడంతో పర్మినెంట్ నివాసుల ప్రతిపత్తి ఎందుకూ కొరగానిదిగా తయారైంది. ఉద్యోగాలకు, భూ హక్కు ఏకపక్షంగా తొలగించేయడంతో జమ్మూ కాశ్మీర్‌లోని అన్ని ప్రాంతాల ప్రజల్లోనూ తాము ఒంటరిపాటుకు గురయ్యామనే అభద్రతా భావం ఏర్పడటానికి ఇది దారితీస్తోంది. ఆర్థిక వ్యవస్థ దాదాపు కుప్పకూలింది. నిరుద్యోగం విపరీతంగా పెరుగుతుండడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. పాలన కుంటుపడటం, అవినీతి పెచ్చరిల్లడం వంటివి కొనసాగుతున్నాయి. మీడియా నోరు నొక్కేయడంతో ప్రజల వేదనలకు సంబంధించిన వార్తలు రావడం లేదు. నిశ్శబ్దంగా అణచివేత సాగిపోతున్నది. అలయెన్స్ ఫర్ గుప్కర్ డిక్లరేషన్ (పిఎజిడి) నాయకులతో ప్రధాని సమావేశం పేరు గొప్ప... ఊరు దిబ్బ అన్నచందంగా తయారైంది. 'దిల్‌సే జోడో, ఢిల్లీ సే జోడో' (హృదయాలతో కనెక్టవ్వండి, ఢిల్లీతో కనెక్టవ్వండి) అన్న నినాదం కేవలం

వాగాడంబరంగానే మిగిలిపోవడం తప్ప దీనివల్ల ఒనగూడిందేమీ లేదు. ఆరెస్సెస్, బిజెపి ఎజెండాకు అనుగుణంగా అసెంబ్లీలో కాశ్మీరీ లోయ వెయిటేజిని తగ్గించడమే ధ్యేయంగా నియోజకవర్గాల పునర్విభజన కసరత్తును చేపట్టింది.

పౌర హక్కులు, ప్రజాతంత్ర హక్కుల అణచివేత యథేచ్ఛగా సాగిపోతున్నది. ఉద్యోగులతో సహా అన్ని సెక్షన్ల ప్రజలనూ విచక్షణా రహితంగా అరెస్టులు చేయడం, వేధింపులకు గురిచేయడం వంటివి నిత్యకృత్యమయ్యాయి. శాంతి భద్రతలు, రాళ్లు రువ్వడం వంటి కేసుల్లో ఉన్న వారికి పాస్‌పోర్టులకు అనుమతిని, ప్రభుత్వ సేవలను నిరాకరించడం వంటి చర్యలు చేపట్టాలంటూ కొత్తగా ఆదేశాలు జారీ చేసింది. నేరం రుజువయ్యే వరకూ అందరూ నిర్దోషులేనని న్యాయశాస్త్రం చెబుతున్నది. దీనికి భిన్నంగా పోలీస్ రిపోర్టును ఆధారంగా చేసుకుని వారికి అన్ని రకాల సేవలనూ నిరాకరించడం సహజ న్యాయాన్ని నిరాకరించడమే. ఇది జమ్మూ కాశ్మీర్‌లో బాహాటంగా ఉల్లంఘించబడుతోంది.

రెండేళ్లుగా జమ్మూ కాశ్మీర్ ప్రజల సాధారణ జీవనోపాధి, రాకపోకలు, కమ్యూనికేషన్ సంబంధాలు గణనీయంగా దెబ్బతిన్నాయి. రెండేళ్ల తరువాత కూడా క్రూరమైన ఉపా (యుఎపిఎ చట్టం) కింద 2,364 మందిని అరెస్టు చేశారు. 1100 మంది ఇప్పటికీ నిర్బంధంలో ఉన్నారు. ప్రజా భద్రతా చట్టం (పిఎస్ఎ) కింద 854 మందిని అరెస్టు చేశారు. వీరిలో 284 మంది ఇప్పటికీ నిర్బంధంలో ఉన్నారు.

'నయా కాశ్మీర్' అంటూ బిజెపి ఇచ్చిన నినాదం బూటకమని పిఎజిడి పేర్కొంది. జమ్మూ కాశ్మీర్ ప్రజల సుదీర్ఘ చారిత్రాత్మక పోరాటం ద్వారా సాధించుకున్న కాశ్మీర్‌ను నాశనం చేసి ఏమి సాధించారు అని సాధారణ ప్రజలు సైతం ప్రశ్నిస్తున్నారు. నిర్దాక్షిణ్యమైన భూస్వామ్య వ్యవస్థ, నిరంకుశ రాచరికపు పాలనకు వ్యతిరేకంగా సాగిన ఆ పోరాటం అన్ని ప్రాంతాల, వర్గాల ప్రజలకు సాధికారత, హుందాగా జీవించే స్థితిని ఇచ్చింది.

తమను విభజించి, నిరాయుధుల్ని చేసేందుకు ప్రభుత్వం సాగిస్తున్న యత్నాలు, తప్పుడు ప్రచారాలకు మోసపోకుండా తామంతా ఐక్యంగా ముందుకు సాగాలన్న భావన జమ్మూ కాశ్మీర్‌లోని అన్ని ప్రాంతాల, వర్గాల ప్రజల్లోనూ నెలకొంది.

జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర పతిపత్తిని పునరుద్ధరించడంతోపాటు భారత రాజ్యాంగం హామీ ఇచ్చిన హక్కులన్నిటినీ తిరిగి వారికి ఇవ్వాలి. ఆ తరువాతే

అసెంబ్లీ ఎన్నికలు జరపాలి. రాజకీయ ఖైదీలందరినీ తక్షణమే విడుదల చేయాలి. రాష్ట్రంలో కమ్యూనికేషన్స్‌ను పూర్తిస్థాయిలో పునరుద్ధరించడంతోపాటు, ప్రజల రాకపోకలు నిరాఘాటంగా సాగేలా చూడాలి.

**సినిమాటోగ్రాఫిక్ చట్ట సవరణలు:** సినిమాటోగ్రఫీ చట్టానికి ప్రతిపాదించిన సవరణలు చిత్ర నిర్మాతల సృజనాత్మక ప్రతిభపైనా, రాజ్యాంగ హక్కు భావ ప్రకటనా స్వేచ్ఛపైనా మోడీ ప్రభుత్వ పూర్తిస్థాయి దాడికి ఆనవాలు. చట్టంలోని సెక్షన్ 5బి(1) (చిత్రాలను ధ్రువీకరించే మార్గదర్శక సూత్రాలు) ఉల్లంఘించారన్న నెపంతో తిరిగి సమీక్షించే అధికారాన్ని తన గుప్పెట్లో పెట్టుకునేందుకు ఒక నిబంధనను అదనంగా జోడించాలని కేంద్ర ప్రభుత్వం కోరుకుంటోంది. ఇప్పటికే ధ్రువీకరించబడిన, మూసివేయబడిన చిత్రాలను మొత్తంగా ఉపసంహరించుకోవడమే. ఇటీవల కాలంలో హిందూత్వ బ్రిగేడ్, కులతత్వ గ్రూపుల ఆధ్వర్యంలోని మితవాద శక్తులు తమకు నచ్చని చిత్రాలపై మూక సెన్సార్‌షిప్‌కు ఎలా తెగబడుతున్నదీ చూస్తున్నాం. ఇప్పుడు ప్రభుత్వం తన సిద్ధాంతాన్ని విమర్శించే చిత్రాలను నిలిపేసే అధికారం తనకు ఉండాలని కోరుకుంటున్నది. ఫిలిం సెన్సార్ బోర్డు స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసేందుకు సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ వివిధ రూపాల్లో దాడి చేస్తున్నది. సెన్సార్ బోర్డు కత్తిరింపులపై చిత్ర నిర్మాతలు అప్పీలు చేసుకునేందుకు వీలు కల్పించే అప్పిలేట్ బాడీని కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్‌లో ఏకపక్షంగా రద్దు చేసింది.

సినిమాటిక్ ప్రతిభను, స్వేచ్ఛ గొంతు నులిమేందుకే దారుణమైన ఈ సవరణలను తీసుకొచ్చింది. అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను పునరుద్ధరించాల్సిందేనని ప్రముఖ చిత్ర నిర్మాతలు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యం, భావ ప్రకటనా స్వేచ్ఛపై జరిగిన దాడికి వ్యతిరేకంగా ధైర్యంగా గొంతెత్తిన వారికి మద్దతు ఇవ్వాలి.

**తిరోగమన ఐటి నిబంధనలు:** ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి మాధ్యమాల కోసం ఐటి చట్టంలోని నిబంధనలను కేంద్ర ప్రభుత్వం ఇటీవల సవరించింది. ఇవి 2021 మే 26 నుంచి అమలులోకి వస్తాయంటూ ఈ ఏడాది ఫిబ్రవరి 25న విడుదల జేసిన నోటిఫికేషన్‌లో తెలిపింది. మీడియాను మానిపులేట్ చేసే చర్యల్లో భాగంగా భారత ప్రభుత్వం ఢిల్లీ పోలీసులను ఉపయోగించి ట్విట్టర్‌పై ఒత్తిడి తెచ్చి బిజెపికి చెందిన వివిధ నేతల ట్వీట్లను నిరంతరాయంగా అనుమతించేలా చూసుకుంది.

అలా చేయడమంటే ప్రస్తుతం ఉన్న మెసేజ్ ప్రొటోకాల్‌ను ఉల్లంఘించడమేనని డిజిటల్ ప్లాట్‌ఫారమ్స్ అభ్యంతరం లేవనెత్తాయి. మెసేజింగ్ సర్వీసెస్ ఉపయోగించేవారు, సాంకేతిక నిపుణులు కూడా ఈ వాదనకు మద్దతు తెలిపారు. భద్రతా నిబంధలను బలహీనపర్చేందుకు వినియోగదారుల గోప్యతా నిబంధనలను ఉల్లంఘించేదిగా ఉందని, క్రిమినల్ ప్రయోజనాల కోసం హ్యాకింగ్‌కు పాల్పడటం వంటివి మరింతగా పెరిగేందుకు  ఇది ఆస్కారమిస్తుంది.

బిజెపి ప్రభుత్వం తన సంకుచిత ప్రయోజనాల కోసం ట్విట్టర్ ఆఫీసుపై ఐటి మంత్రిత్వశాఖ ఢిల్లీ పోలీసులతో దాడులు జరిపించడం నిర్లజ్జగా ఒత్తిడి తేవడమే. భద్రతా నిబంధనలను తుంగలో తొక్కి, ప్రజల మెసేజ్‌లపై ప్రభుత్వం నిఘా పెట్టడం తిరోగమనంతో కూడిన ప్రమాదకర చర్య. అందువల్ల పౌరుల గోప్యతా హక్కును కాపాడేందుకు బలమైన డేటా పరిరక్షణ చట్టాన్ని పార్లమెంటు తీసుకురావాలి.

**గ్లోబల్ ర్యాంకింగ్ పతనం:** ప్రజల ప్రజాతంత్ర హక్కులు, పౌర స్వేచ్ఛ, మానవ హక్కులపై దాడులు, అన్ని రకాల అసమ్మతినీ జాతి వ్యతరేక చర్యగా ముద్ర వేయడం, రాజ్యాంగ హామీలను తుంగలో తొక్కడం వంటి చర్యలు ప్రజాస్వామ్య పరిరక్షణలో భారత్ అట్టడుగు స్థానంలో ఉన్నట్లు పలు గ్లోబల్ సంస్థలు తేల్చాయి. స్వీడన్‌కు చెందిన 'వి-డెమ్' సంస్థ భారత్‌ను 'ఎలక్ట్రోరల్ ఆటోక్రసీ' (ఎన్నికల నిరంకుశత్వం) అని పేర్కొంది. భారత్‌ది లోపభూయిష్టమైన ప్రజాస్వామ్యం అని 'ఎకనామిస్ట్' ఇంటెలిజెన్స్ యూనిట్ పేర్కొంది. భారత్‌ది స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్యం కాదని, పాక్షిక స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్యం అని అమెరికా కేంద్రంగా పనిచేసే 'ఫ్రీడమ్ హౌస్' పేర్కొంది. పౌర స్వేచ్ఛకు సంబంధించి భారత్ ర్యాంకును 94 నుంచి 111కు తగ్గించేసింది. 'ట్రాన్సపరెన్సీ ఇంటర్నేషనల్' కరప్షన్ సూచీ భారత్ ర్యాంకింగ్‌ను ఆరు స్థానాలు దిగగోసింది.

**భారతీయ విద్య చెల్లా చెదురు:** భారతదేశంలో విద్య ప్రాథమిక స్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకూ పరిశోధనా సంస్థలతో సహా దారుణంగా ఉందని యునిసెఫ్, ఆక్స్‌ఫామ్‌తో సహా పలు అధ్యయనాలు వెల్లడించాయి.

2020లో కరోనా లాక్‌డౌన్‌ల వల్ల ఎలిమెంటరీ, సెకండరీ స్కూళ్లలో చేరిన 24.7 కోట్ల మంది చదువుపై తీవ్ర ప్రభావం పడిందని యునిసెఫ్ పేర్కొంది. ప్రాథమిక ఆరోగ్యం, డిజిటల్ విద్య రెండింటిలోనూ తీవ్ర అసమానతలు నెలకొన్న విషయాన్ని ఆ నివేదిక తెలిపింది.

ఆన్‌లైన్ విద్యను ఒక పరిష్కారంగా చూపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తొలుత కొన్ని యత్నాలు చేసినప్పటికీ అది నిరర్థకంగా ఎలా మారినదీ అసిమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి నిర్వహించిన అధ్యయనంలో పూర్తిగా తేటతెల్లమైంది. ఆన్‌లైన్ తరగతుల వల్ల విద్యార్థికి, టీచర్‌కు మధ్య ఎలాంటి భావోద్వేగ సంబంధం ఉండదని 80 శాతం మంది అభిప్రాయపడగా, ఆన్‌లైన్ ద్వారా అర్థవంతమైన మూల్యాంకనం సాధ్యం కాదని 90 శాతం మంది పేర్కొన్నట్లు ఆ అధ్యయనం తెలిపింది. మధ్యాహ్న భోజన పథకం అదృశ్యం కావడం వల్ల పిల్లల పౌష్టికాహారంపై అది తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో పిల్లలు ఎదుర్కొంటున్న దయనీయ స్థితిని కూడా ఈ అధ్యయనం తెలియజేసింది. ఇది అనేక సమస్యలకు కారణమైంది. పిల్లల అక్రమ రవాణా, బాలకార్మికులు, చిన్న నేరాలు వంటివి అసాధారణ రీతిలో పెరిగిపోయాయి.

ఈ కాలంలో కేంద్ర ప్రభుత్వం విద్యా సంస్థల్లో ప్రవేశం కోసం ప్రత్యేకించి ఒబిసి కేటగిరికి వైద్య, విద్యా సంస్థల్లో ప్రవేశం కోసం రిజర్వేషన్ల ప్రక్రియను పక్కదారి పట్టించే యత్నాలు చేసింది. అలాగే ఉన్నత విద్య కూడా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నది. హాస్టళ్లు, ఇతర సదుపాయాలను మూసివేయడంతో ఉన్నత విద్యలోనూ అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. స్కాలర్‌షిప్‌ల చెల్లింపు, ప్రమోషన్లు, అడ్మిషన్ల కోసం విద్యార్థుల మూల్యాంకనం పెద్దయెత్తున సమస్యలకు కారణమైంది. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆందోళనను పరిష్కరించడంపై మనసు పెట్టడం కానీ, సున్నితత్వం కానీ పూర్తిగా కొరవడింది. మొత్తమ్మీద మానవ వనరులు పూర్తిగా క్షీణించాయి. మన ప్రజాస్వామిక డివిడెండ్లు వృథా అయ్యాయి. ఈ మొత్తం కాలంలో నిరుద్యోగం అడ్డూఅదుపు లేకుండా పెరిగిపోవడం వల్ల యువత ఎక్కువగా నష్టపోయింది.

అందువల్ల స్కూళ్లను తిరిగి తెరవడానికి తక్షణం అనుసరించాల్సిన మార్గం టీచర్లకు, సిబ్బందికి, విద్యార్థులందరికీ ఉచితంగా రెండు డోసుల వ్యాక్సినేషన్ పూర్తి చేయాలి.

**ఒబిసి రిజర్వేషన్లు:** ఒబిసి రిజర్వేషన్ల పట్ల మోడీ ప్రభుత్వ విచక్షణా రహిత, పక్షపాత ధోరణిని ఒబిసిలను గుర్తించే రాష్ట్రాల హక్కును హరించేలా అది వ్యవహరించిన తీరులో చూడొచ్చు. మోడీ ప్రభుత్వం జాతీయ వెనుకబడిన తరగతులకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించేందుకు రాజ్యాంగ సవరణ (102)ను

తీసుకొచ్చింది. ఏయే తరగతులు సామాజికంగా, విద్యా పరంగా వెనుకబడి ఉన్నాయో నోటిఫై చేసే అధికారం రాష్ట్రపతికి ఈ సవరణ ద్వారా దఖలుపడుతుంది. ఈ సవరణ తెచ్చినప్పుడే పార్లమెంటులో ప్రతిపక్ష సభ్యులు దీనిపై అభ్యంతరాలు లేవనెత్తారు. రిజర్వేషన్ల కోసం ఒబిసిలను గుర్తించే రాష్ట్రాల హక్కుపై ఇది తీవ్ర ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదముందన్నారు. అప్పట్నుంచి కేంద్ర ప్రభుత్వం జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ గుర్తించిన ఒబిసిలను కేంద్ర జాబితాలోనూ, రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించిన వెనుకబడిన తరగతులను రాష్ట్ర జాబితాలోనూ నోటిఫై చేస్తున్నాయి. ఈ సవరణకు సంబంధించిన కేసును విచారించిన సుప్రీం కోర్టు ఈ ఏడాది మే నెలలో ఈ సవరణలకు భాష్యం చెబుతూ ఎవరిని ఒబిసిలో నోటిఫై చేయాలన్నా పూర్తి అధికారం రాష్ట్రపతికి అంటే కేంద్ర ప్రభుత్వానికి ఉంటుందని తెలిపింది. సుప్రీం కోర్టు చెప్పిన తీర్పును బట్టి ఈ సవరణ రాష్ట్రాల హక్కులను హరిస్తున్నదని స్పష్టమైంది.

రాష్ట్రాల పరిధిలో ఎవరు ఒబిసినో నిర్ణయించే రాష్ట్రాల హక్కుపై తీవ్రమైన దాడిని ఇది వ్యవస్థాగతం చేస్తున్నది. జరిగిన నష్టాన్ని సరిదిద్దేందుకు రాజ్యాంగాన్ని మరోసారి సవరించడమొక్కటే మార్గం. చివరికి పార్లమెంటు వర్షాకాల సమావేశాల ముగింపులో రాష్ట్రాల హక్కులను పునరుద్ధరించే రాజ్యాంగ సవరణ బిల్లును తెచ్చింది. అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ మెడికల్ సీట్లకు సంబంధించిన ఆలిండియా కోటాలో ఒబిసిలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఇటీవల చేసిన ప్రకటన కూడా తప్పనిసరి స్థితిలో చేసిందే. ఆలిండియా కోటాలో ఒబిసి రిజర్వేషన్లను ప్రవేశపెట్టేందుకు మోడీ ప్రభుత్వం నిరాకరించింది. దీనిపై మద్రాసు హైకోర్టు కోర్టు ధిక్కార నోటీసు ఇవ్వడంతో గత్యంతరం లేని స్థితిలో ఈ ప్రకటన చేసింది.

## పెగాసస్ స్పైవేర్‌తో బిజెపి ప్రభుత్వ నిఘా

సైబర్ నిఘా వేయడంలో ప్రపంచంలోనే పెద్దదైన ఇజ్రాయెల్ సంస్థ ఎన్ఎస్ఓ నుండి పెగాసస్ స్పైవేర్‌ను భారత ప్రభుత్వం కొనుగోలు చేసిందన్న సమాచారం ఆందోళన కలిగించింది. కేవలం 'చట్టబద్ధమైన ప్రభుత్వాల' తో మాత్రమే తాము లావాదేవీలు నిర్వహిస్తామని ఎన్ఎస్ఓ స్పష్టం చేసింది. పెద్ద సంఖ్యలో ప్రజలు, మానవహక్కుల కార్యకర్తలపై నిఘా వేయడానికి వారి స్మార్ట్ ఫోన్లను

హ్యాక్ చేశారని దర్యాప్తులో వెల్లడైంది. ప్రపంచవ్యాప్తంగా 50 వేల మందికి పైగా పౌరులపై ఆయా దేశాల్లో నిఘా పెట్టినట్టు, ఆ ప్రభుత్వాలు ఎన్ఎస్ఓ ఖాతాదార్లుగా ఉన్నట్లు తేలింది. రువాండా, మొరాకో, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, మెక్సికో తదితర దేశాల సరసన భారత్ కూడా వుంది.

'భారత్‌లో వందలాది మంది జర్నలిస్టులు, కార్యకర్తలు, ప్రతిపక్ష రాజకీయ పార్టీల నాయకులు, ప్రభుత్వ అధికారులు, వ్యాపారవేత్తల ఫోన్ నెంబర్లు నిఘా జాబితాలో ఉన్నాయని' ఆ నివేదిక పేర్కొంది. పెగాసస్ నిఘాలో కనీసం 40 మంది జర్నలిస్టులున్నారని, వారి పేర్లు కూడా భారతీయ మీడియా వెల్లడించింది.

మోడీ సర్కారు ఎన్ఎస్ఓ సేవలను వినియోగించుకోలేదని విస్పష్టంగా చెప్పలేదు కాని 'అనధీకృత నిఘా' లేదని పేర్కొంది.

ఈ విషయాల వెల్లడితో భారత ప్రభుత్వం తన పౌరులపై నిఘా కోసం ఎన్ఎస్ఓ ను నియోగించిందని తేటతెల్లమయింది. ఎన్ఎస్ఓ తో తాను చేసుకున్న ఒప్పందమేమిటి, విధివిధానాలేమిటి, అందు కోసం ఎంత ప్రజా ధనాన్ని చెల్లించింది వంటి వివరాలన్నిటినీ భారత ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలి.

మానవ హక్కుల కార్యకర్తల కంప్యూటర్లు, స్మార్ట్ ఫోన్లను హ్యాక్ చేసిన ఉదంతాలు గతంలోనే వెల్లడయ్యాయి. ఇద్దరు హక్కుల కార్యకర్తల పరికరాల్లో డిజిటల్ సమాచారాన్ని దొంగచాటుగా చొప్పించారని అంతర్జాతీయ సంస్థలు నిర్ధారించాయి. ఆ సమాచారం ఆధారంగానే వారిపై దుర్మార్గమైన చట్టాల కింద అభియోగాలు మోపి భీమా కోరెగావ్ కేసుతో జైలులో నిర్బంధించారు.

రాజకీయ నాయకులు, జర్నలిస్టులు, న్యాయాధికారులు, మాజీ సిబిఐ చీఫ్, మాజీ ఎన్నికల కమిషనర్ వంటివారితో సహా ఎందరో భారతీయ పౌరులపై పెగాసస్ సైబర్ సాఫ్ట్‌వేర్‌ను వినియోగించి నిఘా వేయడంపై బిజెపి కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలి. ఇది అరిష్టదాయకం. ఇది కేవలం గోప్యతకు సంబంధించిన ప్రాథమిక హక్కుల ఉల్లంఘన మాత్రమే కాక ప్రజాస్వామ్యంలో వివిధ సంస్థలు తమ రాజ్యాంగ విహిత బాధ్యతల నిర్వహణపై దాడి చేయడమే. స్పైవేర్‌ను వినియోగించడం ప్రజాస్వామ్యాన్ని, దాని వ్యవస్థలనూ ధ్వంసం చేయడంతో సమానం.

నిజాలను నిర్ధారించి, దోషులను శిక్షించేందుకుగాను సుప్రీం కోర్టు పర్యవేక్షణలో ఉన్నత స్థాయి న్యాయ విచారణను వెంటనే చేపట్టాలి.

**రాఫెల్ ఒప్పందం:** 36 రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంలో ఒక 'మధ్యవర్తి'కి పది లక్షల యూరోలు చెల్లించినట్టు ఫ్రెంచ్ మీడియా సంస్థ వెల్లడించడంతో రాఫెల్ ముడుపుల భాగోతం మరోసారి ముందుకొచ్చింది. దస్సాల్ట్

కంపెనీ 2017 సంవత్సర అకౌంట్స్ విశ్లేషణ ఆధారంగా ఆ మీడియా కథనం వచ్చింది.

దాంతో రాఫెల్ విమానాల కొనుగోలుకు వందల కోట్ల డాలర్లతో మోడీ ప్రభుత్వం 2016లో కుదుర్చుకున్న ఒప్పందంపై దర్యాప్తుకు ఫ్రెంచ్ ప్రాసిక్యూషన్ సర్వీస్ (పిఎన్ఎఫ్) ఆదేశించింది. ఇరు ప్రభుత్వాల మధ్య కుదిరిన ఒప్పందంపై జూన్ 14 నుండి న్యాయపరమైన దర్యాప్తు ప్రారంభమైంది. 2015 మార్చి 26న అంటే హిందుస్థాన్ ఏరోనాటిక్స్‌ను తప్పించి కొత్త ఒప్పందం కుదుర్చుకుంటున్నట్టు ప్రధాని మోడీ ప్రకటించడానికి 15 రోజుల ముందే రాఫెల్ విమాన తయారీదారు డస్సాల్ట్ ఏవియేషన్‌తో అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ గ్రూప్ ఒప్పందం చేసుకున్నట్టు అధికారిక పత్రాల పరిశీలనలో తేలింది.

ప్రధాని మోడీ పాత కొనుగోలు ఒప్పందాన్ని రద్దు చేయడం వెనుక భారీ అవినీతి, మనీ లాండరింగ్ జరిగిందని పార్టీ చేసిన అభియోగం మరోసారి నిర్ధారణ అయ్యింది. రాఫెల్ ఒప్పందంపై దర్యాప్తు చేయాలన్న డిమాండ్‌ను మోడీ సర్కారు మొండిగా తిరస్కరించడం ఈ వ్యవహారంలో ఏదో దాచిపెట్టడానికి ప్రయత్నిస్తోందని నిర్ధారణ అవుతోంది. చట్ట విరుద్ధమైన చెల్లింపుల విషయంలో కాగ్ ఆడిట్ రిపోర్టు ఏమీ పరిశీలించజాలదు.

అంతకు ముందరి ఒప్పందాన్ని రద్దు చేసి అధిక ధరకు 36 యుద్ధ విమానాల కొనుగోలుకు జరిగిన ఒప్పందంపై ఉన్నత స్థాయి దర్యాప్తు నిర్వహించి తీరాల్సిందే.

**అస్సాం మిజోరం ఘర్షణ:** మునుపెన్నడూ లేనివిధంగా రెండు ఇరుగు పొరుగు రాష్ట్రాలు, ఎన్‌డిఎ పాలనలోవున్న అస్సాం మిజోరం సాయుధ ఘర్షణలకు దిగాయి. ఇది కేంద్ర ప్రభుత్వం, హోం శాఖల పూర్తి వైఫల్యం. హోం మంత్రి అక్కడకు వెళ్లి ఈశాన్య రాష్ట్రాల ప్రభుత్వాలు, వారి అధికారులతో సమావేశమయిన వెంటనే అటువంటి పరిస్థితి ఏర్పడడం దారుణం. కేంద్రం ఇరు రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి ఉద్రిక్తత తగ్గించినట్టు కనబడుతున్నా లోలోపల మాత్రం రగులుతోంది. ఈశాన్య భారతంలో ప్రశాంత పరిస్థితులు నెలకొనేందుకు గట్టి కృషి జరగాలి.

## పెరుగుతున్న పోరాటాలు

**కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల మధ్య పెరుగుతున్న ఐక్యత:** రైతు ఉద్యమానికి సంఘీభావం, మద్దతు కూడగట్టడానికి, మూడు రంగాల ఉమ్మడి

డిమాండ్లపై ఐక్య పోరాటాలు సాగించడంలో కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల మధ్య ఐక్యత బలోపేతం కావడం ఇప్పటి ముఖ్యాంశం.

తమ హక్కుల సాధనతోబాటు దేశ ఆర్థిక సార్వభౌమత్వాన్ని, సంపదను కాపాడడానికి మన దేశ ప్రాథమిక వర్గాల మధ్య ఐక్యత బలోపేతం కావడం ఒక చారిత్రాత్మక ముందడుగు. ఈ ప్రక్రియ మరింత బలోపేతమై ముందుకు సాగాలి.

చారిత్రాత్మక రైతు పోరాటం: వ్యవసాయ చట్టాల రద్దు, పంటకయ్యే ఉ త్పత్తి వ్యయం, అందులో సగం కలిపి (సి2+50%) మద్దతు ధరగా ప్రకటించాలని కోరుతూ గడచిన ఎనిమిది మాసాలుగా రైతు పోరాటం సాగుతోంది. సింఘు, టిక్రి, ఘాజీపూర్, షాజహాన్‌పూర్, పాల్వాల్, మేవత్ సరిహద్దుల వద్ద వేలాది మంది రైతులు చేరి రాజధాని ఢిల్లీ నగరాన్ని చుట్టుముట్టారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం, హర్యానాలోని బిజెపి- జెజెపి సర్కారు విధించిన తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కుంటూనే రైతు పోరాటం ప్రారంభమైంది. హర్యానాలో బిజెపి-జెజెపి మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, నాయకులను, పంజాబ్‌లో బిజెపి నాయకులపై సాంఘిక బహిష్కరణ గత కొన్ని మాసాలుగా నిరవధికంగా కొనసాగుతోంది.

రిపబ్లిక్ డే సందర్భంగా లక్ష ట్రాక్టర్లతో లక్షలాదిమంది రైతులు చేపట్టిన భారీ శాంతియత ప్రదర్శన కొద్దిమంది  బిజెపి ఏజంట్ల రెచ్చగొట్టుడు చర్యలతో భగ్నం చేయబడింది. తదనంతర కాలంలో ప్రభుత్వం విధించిన నిర్బంధాన్ని ఢిల్లీ సరిహద్దుల్లో వున్న రైతాంగం తిప్పిగొట్టింది. చెక్కా జామ్‌లు, రైల్ రొకోలు, మహా పంచాయత్‌లు నిర్వహించబడ్డాయి. మార్చి 26న భారత్ బంద్ జరిగింది. జూలై 22 నుండి ప్రతి రోజూ వందలాది మంది రైతులు జంతర్‌మంతర్ వద్ద నిరసన తెలుపుతూ రైతు పార్లమెంట్- 'కిసాన్ సంసద్' నిర్వహిస్తున్నారు. పార్లమెంటు సమావేశాలు ముగిసే ఆగస్టు 13 వరకు కొనసాగుతుంది.

**కార్మికవర్గ పోరాటాలు:** దేశ వ్యాప్తంగానూ వివిధ రంగాల్లోనూ పెద్ద పోరాటాలు సాగుతున్నాయి. వేతన సవరణ కోరుతూ స్టీల్ కార్మికుల ఉమ్మడి సమ్మె జరిగింది. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ స్టీల్ కార్మికుల పోరాటం కొనసాగుతోంది. వేతన పెంపుదల, కోవిడ్ సంబంధిత విధుల నిర్వహణ వంటి డిమాండ్లపై అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు సమ్మెలు, పోరాటాలు నిర్వహించారు. వాణిజ్య మైనింగ్‌కు వ్యతిరేకంగా గని కార్మికులు ఉద్యమం నిర్వహించారు. సాధారణ బీమా ప్రైవేటీకరణకు ఉద్దేశించిన జనరల్ ఇన్సూరెన్స్ బిజినెస్ (నేషనలైజేషన్) బిల్లు 2021 ను చట్టం చేయడాన్ని నిరసిస్తూ దాదాపు 66 వేల మంది జిఐసి ఉద్యోగులు,

అధికార్లు ఆగస్టు 4న దాదాపు సంపూర్ణ సమ్మె చేశారు. విద్యుత్ పంపిణీ రంగాన్ని ప్రైవేటీకరించేందుకు చేయనున్న విద్యుత్ చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఆగస్టు పదవ తేదీన విద్యుత్ ఉద్యోగులు, అధికారులు సమ్మె చేయనున్నారు.

**ఉపాధి కోసం యువత**

రైల్వేల్లో ఉద్యోగ ఖాళీలను రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా యువత నిరసనలు చేపట్టారు. పశ్చిమ బెంగాల్, కేరళ, త్రిపుర, తమిళనాడు, ఒడిషా, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో యువ కార్యకర్తలు కోవిడ్ సహాయ కార్యక్రమాల్లో విస్తృత సేవలందించారు.

ఈ సమయంలో ఉపాధి అవకాశాలు, నాణ్యమైన ఉపాధి లభ్యత ప్రధాన సమస్యలు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యమాల నిర్వహణకు యూనిట్లు ఏర్పాటు చేయబడ్డాయి. కరోనా రెండవ దశ కారణంగా అనేక రాష్ట్రాల్లో అటువంటి స్థానిక ఉద్యమాలకు ఆటంకం ఏర్పడింది. అయితే, కరోనా కేసులు తగ్గుముఖం పడుతున్నందున ఆ ప్రక్రియ పునరుద్ధరించబడుతోంది.

**ప్రభుత్వ విద్య కోసం విద్యార్థులు**

యుజిసి ప్రతిపాదించిన కలగలుపు విద్యా (బ్లెండింగ్) విధానాన్ని వ్యతిరేకిస్తూ వివిధ లౌకిక, ప్రజాస్వామ్య భావాలుగల విద్యార్థి సంఘాలతో ఏర్పడిన అఖిల భారత ప్రభుత్వ విద్యా పరిరక్షణ వేదిక అధ్వర్యాన భారత రాష్ట్రపతికి సామూహిక ఇ మెయిల్స్ పంపే ఉద్యమం సాగింది. నూతన విద్యా విధానం 2020కి వ్యతిరేకంగా, విద్యా సంస్థల పున:ప్రారంభం, తదితర అంశాలపై ఉద్యమాలు కొనసాగుతున్నాయి. కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థల్లో రిజర్వేషన్ల అమలులో జరుగుతున్న ఉల్లంఘనలకు వ్యతిరేకంగా నిరంతర ఆందోళనలు చేపట్టిన ఫలితంగా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సంక్షేమ పార్లమెంటరీ స్థాయీసంఘం జోక్యం చేసుకుంది.

సార్వత్రిక ఉచిత వ్యాక్సినేషన్ కోరుతూ విద్యార్థి సంఘం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌తోపాటు ఇలాంటి మరికొన్ని పిటిషన్లపై విచారించిన సర్వోన్నత న్యాయస్థానం కేంద్ర ప్రభుత్వ వ్యాక్సినేషన్ విధానాన్ని పున:పరిశీలించాలని ఆదేశించింది. ఆ తరువాతనే కేంద్ర ప్రభుత్వం పాక్షికంగా ఉచిత టీకా విధానాన్ని ప్రకటించింది.

ఆకలికి వ్యతిరేకంగా మహిళలు

ప్రభుత్వం ఇస్తామన్న ఆహార ధాన్యాలు సక్రమంగా పంపిణీ కావడం లేదు. ఏదో ఒక సాకు చూపి అనేకమంది లబ్ధిదారులకు తిరస్కరిస్తున్నారు. ఆహార ధాన్యాల పంపిణీలో అవినీతికి వ్యతిరేకంగా రేషన్ దుకాణాలవద్ద మహిళలు పికెటింగ్‌లు చేశారు. దాంతో అధికార యంత్రాంగం పంపిణీకి చర్యలు చేపట్టింది.

రెండవ దశ కోవిడ్ సమయంలో దేశ వ్యాప్తంగా మహిళా బృందాలు గ్రామాల్లో, బస్తీల్లో ఆహార ధాన్యాలను, నిత్యావసర సరుకులను పంచిపెట్టారు. మహిళా కార్యకర్తలు స్థానికంగా వంటశాలలు నిర్వహించి ఆకలిగొన్న కుటుంబాలకు ఆహారాన్ని వండి పెట్టారు.

ఆహార ధాన్యాల కోసం ఘెరావోలు, రేషన్ కార్డుల మంజూరుకు, వృద్ధాప్య, వితంతు పింఛన్ల మంజూరుకు, ఇంటి పనివారికి సహాయం, ఆన్‌లైన్ విద్యను అభ్యసించడానికి పిల్లలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల తొలగింపునకు, విద్యా సంస్థల్లో అధిక ఫీజులకు వ్యతిరేకంగా, హింసకు వ్యతిరేకంగా తదితర సమస్యలపై మహిళా రంగంలో కృషి జరిగింది.

**రాజకీయ పరిస్థితి**

ఏప్రిల్, మే నెలల్లో జరిగిన నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపికి ఎదురుదెబ్బలు తగిలాయి. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళల్లో ఆ పార్టీ, దాని మిత్రపక్షాలు ఓడిపోయాయి. అస్సాంలో మాత్రమే స్వల్ప తేడాతో తిరిగి అధికారాన్ని పొందింది.

ఉత్తరాఖండ్, కర్ణాటక రాష్ట్రాల్లో బిజెపి ప్రభుత్వాల్లో, పార్టీలో ఇటీవల సమస్యలు తలెత్తాయి. రెండు నెలల వ్యవధిలోనే ఉత్తరాఖండ్‌లో ఇద్దరు ముఖ్యమంత్రుల్ని మార్చవలసి వచ్చింది. కర్ణాటకలో యడియూరప్పను గద్దె దింపి బొమ్మైని కొత్త ముఖ్యమంత్రిగా ప్రతిష్టించారు.

కోవిడ్ రెండవ దశ నివారణలో బిజెపి కేంద్ర ప్రభుత్వ వైఫల్యం కారణంగా తన మద్దతుదారులైన మధ్యతరగతి వారితోసహా ప్రజలలో అసంతృప్తి పెరిగింది. ఉత్తరప్రదేశ్‌లోని ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. గంగా నదిలో శవాలు తేలియాడుతున్న చిత్రాలు అంతర్జాతీయ వార్తలుగా మారాయి.

ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు మరో ఏడు నెలల వ్యవధిలో జరుగనున్న నేపథ్యంలో అక్కడి బిజెపి ప్రభుత్వం ప్రజల దృష్టి మళ్లించడానికి తన మతతత్వ

ఎజండాను అమలు చేస్తోంది. కొత్త జనాభా విధానం, లవ్ జీహాద్ చట్టం మున్నగు వాటితో ప్రజల మధ్య విభజనను తీవ్రతరం చేస్తోంది.

ఏమైనాగాని ఈ కాలంలో రైతు ఉద్యమం, కార్మికుల పోరాటాలు బలపడుతున్నాయి. పార్లమెంటులో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్షం మరింత ఐక్యంగా నిలిచింది.

కాబట్టి, మోడీ ప్రభుత్వ హిందుత్వా నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా విశాల ఐక్య పోరాటాలు నిర్మించడం, అన్ని లౌకిక ప్రజాతంత్ర శక్తులను సమీకరించడం అవసరం.

**కేంద్ర కమిటీ డిమాండ్లు**

కేంద్ర ప్రభుత్వం కింది సమస్యలను పరిష్కరించాలని పార్టీ కేంద్ర కమిటీ డిమాండ్ చేస్తోంది.

1. వ్యాక్సిన్ ఉత్పత్తికి దేశంలో ఉన్న సామర్థ్యాన్నంతటినీ అమలులోకి తేవాలి. విదేశాల నుండి వ్యాక్సిన్ దిగుమతి చేసుకోవాలి. ఉచిత సార్వత్రిక సామూహిక టీకా ప్రక్రియను వేగవంతం చేయాలి. కోవిడ్‌తో మరణించినవారి కుటుంబాలకు తగిన నష్ట పరిహారం అందించాలి. ప్రభుత్వ వైద్య వ్యవస్థను విస్తృతపరచాలి.
2. ఇన్‌కమ్ ట్యాక్స్ పరిధిలో లేని ప్రతి కుటుంబానికి నెలకు రూ.7,500లు అందించాలి.
3. కేరళలో మాదిరిగా నిత్యావసర వస్తువులతో ఆహార కిట్లు అవసరమైన వారందరికీ ఉచితంగా అందించాలి.
4. పెట్రో ఉత్పత్తుల మీద కేంద్రం విధించిన ఎక్సైజ్ డ్యూటీలు, సర్‌ఛార్జీలు వెంటనే ఉపసంహరించుకోవాలి. అధిక ధరలను అదుపు చేయాలి.
5. రైతు వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలి. రైతు ఉత్పత్తి వ్యయం (సి2)లో 50% మిగులు ఉండేలా మద్దతు ధరకు అమ్ముకునే హక్కు కల్పిస్తూ చట్టం తేవాలి.
6. ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రయివేటీకరణ ఆపాలి. ఇప్పటికే చేసిన వాటిని ప్రభుత్వ రంగంలోకి పునరుద్ధరించాలి.
7. కార్మిక కోడ్ లను రద్దు చేయాలి. శ్రామికులు సమ్మె ద్వారా నిరసన తెలిపేందుకు, వేతనాల కోసం బేరసారాలాడే హక్కులను పునరుద్ధరించాలి.
8. ఎంఎస్‌ఎంఇ లకు రుణాలు కాకుండా పునరుద్ధరణకు అవసరమైన ఆర్థిక ఉ ద్దీపన ప్యాకేజి ప్రకటించాలి.

9. గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా 200 పని దినాలు గ్యారంటీ చేస్తూ, వేతనానన్ని కనీసం రెట్టింపు చేసే విధంగా విస్తరించాలి.

10. గ్రామీణ ఉపాధి హామీ చట్టం తరహాలో పట్టణ ఉపాధి హామీ చట్టాన్ని చేయాలి.

11. ఆర్థిక, సామాజిక మౌలికవసతుల కల్పనకు, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు, దేశీయ డిమాండ్ పెంచేందుకు ప్రభుత్వ వ్యయాన్ని పెంచాలి. ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేయాలి.

12. విద్యా సంస్థలను తొందరగా పున:ప్రారంభేందుకు వీలుగా ఉపాధ్యాయులకు, సిబ్బందికి, విద్యార్థులకు ప్రాధాన్యతనిచ్చి కరోనా టీకా ఇవ్వాలి.

13. ప్రజలపై నిఘా పెట్టేందుకు పెగాసస్ సైనిక గూఢచర్య స్పైవేర్ వినియోగించడంపై సుప్రీం కోర్టు పర్యవేక్షణలో న్యాయ విచారణ వెంటనే జరపాలి.

14. రాఫెల్ ఒప్పందం (పాత కొనుగోలు ఆర్డర్‌ను రద్దు చేసి అధిక ధరకు కొత్త ఆర్డర్ పెట్టిన)పై ఉన్నత స్థాయి దర్యాప్తు నిర్వహించాలి.

15. క్రూరమైన యుఎపిఎ కింద నేరారోపణ చేయబడ్డ భీమా కోరెగావ్ కేసు, సిఎఎ వ్యతిరేక నిరసనకారులతో సహా రాజకీయ ఖైదీలందరినీ వెంటనే విడుదల చేయాలి. ప్రజల ప్రజాస్వామిక హక్కులను, పౌర హక్కులను కాలరాసే దేశ ద్రోహం, జాతీయ భద్రతా చట్టం వంటి దుర్మార్గ చట్టాలను ప్రయోగించడానికి స్వస్థి పలకాలి. తమ ప్రాథమిక హక్కయిన భావ ప్రకటనా స్వేచ్ఛను వినియోగించుకుంటున్న జర్నలిస్టులను నిర్బంధించారు. వారినందరినీ విడిచిపెట్టాలి. జమ్ము కాశ్మీర్‌లోని రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేయాలి.

**కేంద్ర కమిటీ పిలుపు**

పైన పేర్కొన్న డిమాండ్లతో సెప్టెంబర్ నెలలో దేశ వ్యాప్తంగా నిరసనలు, పోరాటాలు నిర్వహించాలని పార్టీ రాష్ట్ర కమిటీలకు, ఆ దిగువనున్న అన్ని యూనిట్లకూ కేంద్ర కమిటీ పిలుపునిస్తోంది. స్థానిక పరిస్థితులు, కోవిడ్ సంబంధిత లాక్‌డౌన్లు వంటివాటినిబట్టి నిరసనలకు సంబంధించిన వివరాలను రాష్ట్ర కమిటీలు నిర్ణయిస్తాయ.

పై డిమాండ్లపై చేపట్టే కార్యక్రమాలకు కలిసివచ్చేందుకు సుముఖంగా వుండే అన్ని తరగతులవారిని సమీకరించడానికి కృషి చేయాలి.

***

ప్రతులు : 1500 ప్రచురణ కాలం : ఆగస్టు, 2021 వెల : ₹15/-

ప్రచురణ

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటి

27-13-3, సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ కార్యాలయం, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-2,

ఫోన్ నెం. 0866 2577202, 9490099057